@vaartanews @mvnewstv www.mivaartanews.com
TGBIL/25/A0512
మీ వార్త
AP EDITION
ప్రతి అక్షరం... ప్రజల కోసం
విజయవాడ
గురువారం 19 నవంబర్ 2026
సంపుటి : 2
సంచిక : 260
పేజీలు : 8 వెల : 5/-

వార్త
విలేకరులు కావలెను
ఈ క్రింది నెంబర్లకు వాట్సప్ ద్వారా తమ వివరాలు పంపగలరు
96763 94932

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను
ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు,
నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జీలు,
మండలాల వారీగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఏపీలో నేటి నుంచి స్థానిక సంస్థలకు కొత్త పాలకవర్గాలు

- నేడు ఎంపీపీ, వైస్ ఎంపీపీల ఎన్నిక
- రేపు 28 జిల్లాల్లో జడ్పీ చైర్మన్లు, వైస్ చైర్మన్ల ఎంపిక
- ఎన్నికైన రోజు నుంచే ఐదేళ్ల పదవీకాలం ప్రారంభం
- ఉదయం 10 గంటలకు నామినేషన్ల స్వీకరణ
- ఎంపీటీసీలు, జడ్పీటీసీల ద్వారా పరోక్ష ఎన్నికలు
- కో-ఆప్టెడ్ సభ్యుల ఎంపికకు ప్రత్యేక నిబంధనలు
- ఎన్నికల నిర్వహణకు అధికారులకు ఎస్ఈసీ ఆదేశాలు

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో మండల, జిల్లా పరిషత్‌లకు నూతన పాలకవర్గాల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. గురువారం ఎంపీపీలు, వైస్ ఎంపీపీలను ఎంపీటీసీ సభ్యులు ఎన్నుకోనుండగా, శుక్రవారం 28 జిల్లా పరిషత్‌లకు చైర్మన్లు, వైస్ చైర్మన్లను జడ్పీటీసీలు ఎన్నుకోనున్నారు. పరోక్ష పద్ధతిలో జరిగే ఈ ఎన్నికలతో ఎన్నికైన పాలకవర్గాల ఐదేళ్ల పదవీకాలం ప్రారంభం కానుంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం - మిగతా3లో

గ్రీన్ ఎనర్జీకి పెద్దపీట

- భవిష్యత్ అవసరాలకు పక్కా ప్రణాళిక!
- రూ.21,838 కోట్లతో గ్రీన్ ఎనర్జీ కారిడార్-3
- ఆరు నెలల్లో 14,852 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ అంచనా
- 103 ప్రాజెక్టులకు ఆమోదం.. రూ.4.20 లక్షల కోట్ల పెట్టుబడులు

అమరావతి

రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని పునరుత్పాదక ఇంధన రంగాన్ని మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలను సిద్ధం చేయాలని సూచించారు. ఉండవల్లిలోని క్యాంపు



కార్యాలయంలో ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో విద్యుత్ డిమాండ్, కొత్త ప్రాజెక్టుల పురోగతి, పెట్టుబడుల ఒప్పందాలపై చర్చించారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు విద్యుత్ వినియోగం - మిగతా3లో



సీజేఐపై అనుచిత వ్యాఖ్యలు..
న్యాయవాదికి సుప్రీంకోర్టు ధిక్కరణ నోటీసులు

- న్యాయవ్యవస్థపై ఆరోపణల నేపథ్యంలో చర్యలు
- వివరణ ఇవ్వాలని ఆదేశం.. 2027 జనవరి 20కు తదుపరి విచారణ



భారత్ వ్యతిరేక ప్రచారానికి రాహుల్‌గాంధీ నాయకత్వం

- కొలంబియా యూనివర్సిటీలో దేశ ఆర్థిక వ్యవస్థపై వ్యాఖ్యలతో రాజకీయ దుమారం
- విదేశాలకు వెళ్లినప్పుడల్లా తప్పుడు వ్యాఖ్యలు

ఆయుష్మాన్ భారత్‌లో భారీ మార్పులు!

- 23 నుంచి 112కు పెరగనున్న ప్యాకేజీలు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో మరిన్ని చికిత్సలు
- 89 కొత్త వైద్య సేవలకు ప్రతిపాదన
- చిన్నచిన్న వ్యాధులకు స్థానికంగానే వైద్యం
- హిస్టరెక్టమీ నుంచి గ్లకోమా వరకు చికిత్సలు
- ఆస్పత్రుల అభివృద్ధికి అదనపు నిధులు



ఉత్తరాంధ్రకు రెడ్ అలర్ట్

- నరసాపురం--పూరీ మధ్య తీరం దాటే అవకాశం
- గంటకు 110 కి.మీ. వేగంతో ఈదురుగాలులు..
- అప్రమత్తమైన యంత్రాంగం
- తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



విశాఖపట్నం

బంగాళాఖాతంలో ఏర్పడిన అక్వాన్ తీవ్ర తుపాను ఉత్తరాంధ్ర తీర ప్రాంతాల వైపు కదులుతోంది. తుపాను ప్రభావంతో ఉత్తరాంధ్ర, యానాం, దక్షిణ ఒడిశా తీర ప్రాంతాలకు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. నవంబర్ 20వ తేదీ శుక్రవారం మధ్యాహ్నానికి నరసాపురం--పూరీ మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో, గరిష్ఠంగా 110 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. భారత వాతావరణ శాఖ తాజా బులెటిన్ ప్రకారం అక్వాన్ తుపాను గత ఆరు గంటల్లో గంటకు 9 కిలోమీటర్ల వేగంతో ఉత్తర వాయవ్య దిశగా కదిలింది. నవంబర్ 18 సాయంత్రం 5.30 గంటల సమయానికి నరసాపురానికి 500 కిలోమీటర్లు, కళింగపట్నానికి 540 కిలోమీటర్లు, చెన్నైకి 560 కిలోమీటర్లు, పూరీకి 690 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. తుపాను మరింత - మిగతా3లో



మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది లతీఫ్ భట్ హతం

- మసీదులో దాక్కున్నా వదలని భద్రతా బలగాలు..
- లొంగిపోవాలని కోరినా నిరాకరణ
- రూ.15 లక్షల రివార్డు ప్రకటించిన ఉగ్రవాది కథకు తెర..
- ఆపరేషన్‌ను అభినందించిన అమిత్ షా

సెమీకండక్టర్ హబ్‌గా ఏపీ

చిప్ తయారీలో గ్లోబల్ కేంద్రంగా తీర్చిదిద్దుతాం!
మంత్రి నారా లోకేశ్ ప్రకటన
సిలికాన్ ఫ్యాబ్‌లకు 80 శాతం పెట్టుబడి రాయితీ
తిరుపతిలో 5 వేల ఎకరాల్లో ప్రత్యేక పార్క్



అమరావతి

దేశంలోనే సెమీకండక్టర్ తయారీకి ఆంధ్రప్రదేశ్‌ను ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. చిప్‌ల తయారీ నుంచి ప్యాకేజింగ్ వరకు అన్ని విభాగాల్లో రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయి హబ్‌గా అభివృద్ధి చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించనున్నట్లు వెల్లడించారు. సిలికాన్ ఫ్యాబ్‌ల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి 80 శాతం వరకు పెట్టుబడి రాయితీ కల్పిస్తాయని తెలిపారు. సెమీకండక్టర్ తయారీ పరిశ్రమలకు ప్రోత్సాహం కల్పించేలా ఏపీ ప్రభుత్వం సెమీకండక్టర్ అండ్ డిస్‌ప్లే ఫ్యాబ్ పాలసీ 4.0ను ప్రకటించినట్లు లోకేశ్ వివరించారు. - మిగతా3లో

మోదీ పాలనలో సామాన్యుడి కంచం చిన్నదైంది!



- ధరల పెరుగుదలపై కేంద్రంపై ఖర్గే ఫైర్
- కనీస అవసరాలకూ కష్టమే
- నిత్యావసరాల ధరలకు రెక్కలు
- దేశ పురోగతికి కొలమానం ప్రసంగాలు కాదు
- ధరల నియంత్రణపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- భారీగా పెరిగిన టోకు ద్రవ్యోల్బణం
- ఇంధనం, ఆహార ధరల ప్రభావం

భారత్-జపాన్ బంధానికి ఇదే సరైన సమయం!

- ప్రపంచ పరిణామాలతో మారుతున్న అంతర్జాతీయ వ్యవస్థ
- కొవిడ్, యుద్ధాలతో సరఫరా వ్యవస్థలకు సవాళ్లు
- తక్కువ ఖర్చు కంటే విశ్వసనీయతకే పెద్దపీట
- జపాన్ పెట్టుబడులకు భారత్ ఆకర్షణీయ గమ్యం
- సెమీకండక్టర్లు, కీలక ఖనిజాల్లో భాగస్వామ్యం



ఆయుష్మాన్ భారత్‌లో భారీ మార్పులు!

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. ఆయుష్మాన్ భారత్ – ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (ఆదీ ్రావీ–జీఆ్) పథకంలో ప్రభుత్వ ఆస్పత్రులకు ప్రత్యేకంగా కేటాయించిన చికిత్సల పరిధిని భారీగా విస్తరించాలని యోచిస్తోంది. ఇందులో భాగంగా ప్రస్తుతం 23గా ఉన్న ఆరోగ్య ప్రయోజన ప్యాకేజీల సంఖ్యను ఏకంగా 112కు పెంచాలని ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే ప్రభుత్వ ఆస్పత్రుల్లో మరిన్ని రకాల వైద్య, శస్త్రచికిత్స సేవలు అందుబాటులోకి రానున్నాయి.



23 నుంచి 112కు ప్యాకేజీలు

ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు నగదు రహిత వైద్య చికిత్స అందించడమే కేంద్రం లక్ష్యం. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రులకు ప్రత్యేకంగా కేటాయించిన 23 ఆరోగ్య ప్రయోజన ప్యాకేజీలను 112కు పెంచే ప్రతిపాదనను నేషనల్ హెల్త్ అథారిటీ (ఎన్‌హెచ్‌ఏ) సిద్ధం చేసింది. ఇందులో కొత్తగా 89 వైద్య, శస్త్రచికిత్స ప్యాకేజీలను చేర్చాలని గుర్తించింది. సాధారణ అనారోగ్య సమస్యల నుంచి కొన్ని కీలక శస్త్రచికిత్సల వరకు విస్తృత సేవలను ప్రభుత్వ వైద్య సంస్థల ద్వారా అందించేందుకు ప్రణాళిక రూపొందిస్తోంది.

సాధారణ వ్యాధులకు సమీపంలోనే చికిత్స

ప్రస్తుతం చిన్నచిన్న అనారోగ్య సమస్యలకు కూడా చాలామంది రోగులు దూర ప్రాంతాల్లోని పెద్ద ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని మార్చడమే ప్రతిపాదన ప్రధాన ఉద్దేశం. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, సబ్ డివిజనల్ ఆస్పత్రులు, ఇతర ప్రభుత్వ వైద్య సంస్థల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలను ఉపయోగించుకుని మరిన్ని చికిత్సలు అందించనున్నారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల ప్రజలకు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు లభించే అవకాశం ఉంటుంది.

ఏయే చికిత్సలు అందుబాటులోకి వస్తాయంటే?

ఎన్‌హెచ్‌ఏ గుర్తించిన ప్రతిపాదిత ప్యాకేజీల్లో పలు సాధారణ శస్త్రచికిత్సలు, వైద్య పరీక్షలు ఉన్నాయి. ముఖ్యంగా హిస్టరెక్టమీ (గర్భాశయ తొలగింపు), సున్తీ, బయాప్సీ, హైడ్రోసీల్, హెమరాయిడ్స్, సిస్ట్‌లు, లిపోమాల చికిత్సలను చేర్చాలని ప్రతిపాదించారు. అలాగే కంటి సంబంధిత సమస్యల్లో డయాబెటిక్ రెటినోపతి, గ్లకోమా స్క్రీనింగ్‌కు అవకాశం కల్పించనున్నారు. రక్తహీనత, అధిక రక్తపోటు, బ్రాంకైటిస్, డయేరియా, రక్తవిరేచనాలు, గ్యాస్ట్రోఎంటరైటిస్, మూత్రనాళ ఇన్ఫెక్షన్లు, రీనల్ కోలిక్, తీవ్రమైన జ్వర సంబంధిత అనారోగ్యాలు, మధుమేహ సంబంధిత కొన్ని సమస్యలకు చికిత్సలు అందించేలా ప్రతిపాదనలు రూపొందించారు.

ప్రభుత్వ ఆస్పత్రులకు అదనపు ఆదాయం ఈ ప్రతిపాదన వల్ల రోగులకే కాకుండా ప్రభుత్వ ఆస్పత్రులకు కూడా ప్రయోజనం చేకూరనుంది. ఆయుష్మాన్ భారత్ కింద అర్హులైన రోగులకు నగదు రహిత చికిత్స అందించినందుకు ప్రభుత్వ ఆస్పత్రులకు రీయింబర్స్‌మెంట్ రూపంలో నిధులు అందుతాయి. ఈ మొత్తాన్ని ఆస్పత్రుల మౌలిక సదుపాయాల అభివృద్ధికి, ఆధునిక వైద్య పరికరాల కొనుగోలుకు, మందులు, ఇతర వైద్య వినియోగ వస్తువుల సమకూర్పునకు వినియోగించుకోవచ్చు. అంతేకాకుండా అదనపు వైద్య సిబ్బంది నియామకం, ఆస్పత్రుల నిర్వహణ ఖర్చులకు కూడా ఈ నిధులు ఉపయోగపడనున్నాయి.

రాష్ట్రాల అభిప్రాయాల సేకరణ

ప్రతిపాదిత మార్పులపై రాష్ట్రాల అభిప్రాయాలను సేకరించేందుకు నేషనల్ హెల్త్ అథారిటీ 2026 అక్టోబర్ 13న మెమోరాండం జారీ చేసినట్లు సమాచారం. కొత్త ప్యాకేజీల జాబితాను పరిశీలించి, తమ సూచనలు, అభిప్రాయాలను నవంబర్ 25లోపు సమర్పించాలని రాష్ట్ర ఆరోగ్య ఏజెన్సీలను కోరింది. రాష్ట్రాల నుంచి అందే సూచనలను పరిశీలించిన అనంతరం తుది విధానాన్ని ఖరారు చేయనున్నారు.

డిసెంబర్ 1 నుంచి అమలయ్యే అవకాశం

రాష్ట్రాల అభిప్రాయాలు, సిఫార్సులను పరిగణనలోకి తీసుకున్న తర్వాత సవరించిన విధానాన్ని 2026 డిసెంబర్ 1 నుంచి అమల్లోకి తీసుకురావచ్చని ఎన్‌హెచ్‌ఏ వర్గాలు వెల్లడించినట్లు కథనంలో పేర్కొన్నారు. అయితే ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాలు, శిక్షణ పొందిన సిబ్బంది ఆధారంగా ప్యాకేజీల అమలును నిర్ణయించనున్నారు. అవసరమైతే ముందస్తు అనుమతితో రాష్ట్రాలు తమ పరిధిలోని రిజర్వ్ ప్యాకేజీల సంఖ్యను తగ్గించుకునే వెసులుబాటు కూడా కల్పించనున్నారు.

గ్రామీణ పేదలకు మరింత మేలు

ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే ముఖ్యంగా గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ప్రయోజనం కలిగే అవకాశం ఉంది. చిన్నచిన్న చికిత్సల కోసం జిల్లా కేంద్రాలు, నగరాల్లోని పెద్ద ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుంది. ప్రయాణ ఖర్చులు, సమయం ఆదా అవుతాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవల వినియోగం పెరగడంతో వాటి సామర్థ్యం, సేవల నాణ్యత కూడా మెరుగుపడే అవకాశం ఉంటుంది.

ఆయుష్మాన్ భారత్ పథకంలో ప్రతిపాదించిన ఈ విస్తరణ అమల్లోకి వస్తే ప్రభుత్వ వైద్య రంగానికి కొత్త ఊతం లభించనుంది. అయితే 112 ప్యాకేజీల పెంపు ప్రస్తుతం ప్రతిపాదన దశలోనే ఉందని, తుది మార్గదర్శకాలు విడుదలైన తర్వాతే ఏయే చికిత్సలు ఎక్కడ అందుబాటులోకి వస్తాయో స్పష్టత రానుంది.

మోదీ పాలనలో సామాన్యుడి కంచం చిన్నదైంది!

న్యూఢిల్లీ: దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిత్యావసర వస్తువుల ధరలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో సామాన్యుడి జీవనం భారంగా మారిందని, ధరల పెరుగుదలతో ప్రజల జేబులు ఖాళీ అవుతున్నాయని విమర్శించారు. 2014లో ధరలను నియంత్రిస్తామని ఇచ్చిన హామీలకు, ప్రస్తుత పరిస్థితులకు పొంతన లేదని వ్యాఖ్యానించారు. ఆర్థిక నిర్వహణలో లోపాల భారాన్ని సామాన్య ప్రజలు ఇంకెంతకాలం భరించాలని ప్రశ్నించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు.



కనీస అవసరాలకూ కష్టమే

ప్రధాని మోదీ పాలనలో సామాన్యులు కనీస అవసరాలు తీర్చుకోవడానికి సైతం ఇబ్బందులు పడుతున్నారని ఖర్గే ఆరోపించారు. 2014లో ధరలను తగ్గిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, 2026 నాటికి నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగే పరిస్థితిని తీసుకొచ్చిందని విమర్శించారు. ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతోందని, కుటుంబ బడ్జెట్లు తలకిందులవుతున్నాయని పేర్కొన్నారు. గోధుమ పిండి ధర కిలో రూ.21 నుంచి రూ.69కు, కందిపప్పు ధర రూ.75 నుంచి రూ.180కు, ఆవనూనె ధర రూ.102 నుంచి రూ.263కు పెరిగిందని ఖర్గే వెల్లడించారు. అలాగే లీటర్ పాల ధర రూ.36 నుంచి రూ.85కు, కిలో బియ్యం ధర రూ.29 నుంచి రూ.71కు చేరిందని పేర్కొన్నారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల సామాన్యులపై తీవ్ర ప్రభావం చూపుతోందని అన్నారు.

దేశ పురోగతికి కొలమానం ప్రసంగాలు కాదు

అక్టోబర్ నెలలో ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం 8.94 శాతానికి, టోకు ధరల ద్రవ్యోల్బణం 12.29 శాతానికి చేరినట్లు ఖర్గే ప్రస్తావించారు. గతేడాదితో పోలిస్తే 61 శాతం కుటుంబాల్లో నిత్యావసర వస్తువులపై నెలవారీ ఖర్చు 20 శాతానికి పైగా పెరిగిందని తెలిపారు. మరోవైపు 74 శాతం మంది ప్రజలు అత్యవసరం కాని ఖర్చులను తగ్గించుకుంటున్నారని పేర్కొన్నారు. దేశ పురోగతిని ప్రధాని మోదీ ప్రసంగాల నిడివితో కొలవలేమని, సామాన్యుడి కంచంలో ఉన్న ఆహారం, ఖర్చుల తర్వాత జేబులో మిగిలే ఆదాయమే నిజమైన అభివృద్ధికి కొలమానమని ఖర్గే వ్యాఖ్యానించారు.

ధరల నియంత్రణపై శ్వేతపత్రం విడుదల చేయాలి

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ సైతం ధరల పెరుగుదల అంశంపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ నిర్దేశించిన 6 శాతం గరిష్ఠ పరిమితిని దాటి 6.09 శాతానికి చేరిందని ఆరోపించారు. అక్టోబర్‌లో టోకు ధరల ద్రవ్యోల్బణం కూడా 12.29 శాతానికి పెరిగిందని పేర్కొన్నారు. ధరల పెరుగుదలతో కుటుంబాల ఆహార బడ్జెట్‌పై అదనపు భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

భారీగా పెరిగిన టోకు ధరల ద్రవ్యోల్బణం

అక్టోబర్ నెలలో దేశ టోకు ధరల ద్రవ్యోల్బణం 12.29 శాతానికి పెరిగినట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ప్రధానంగా ఇంధనం, విద్యుత్ ధరల పెరుగుదల దీనికి కారణమని పేర్కొంది. సెప్టెంబర్‌లో 25.85 శాతంగా ఉన్న ఇంధనం, విద్యుత్ విభాగం ద్రవ్యోల్బణం అక్టోబర్‌లో 32.84 శాతానికి చేరినట్లు తెలిపింది. ప్రాథమిక వస్తువుల ద్రవ్యోల్బణం 8.67 శాతం నుంచి 9.24 శాతానికి పెరిగింది. అయితే తయారీ ఉత్పత్తుల ద్రవ్యోల్బణం మాత్రం 9.76 శాతం నుంచి స్వల్పంగా తగ్గి 9.54 శాతానికి పరిమితమైంది.

ఇంధనం, ఆహార పదార్థాల ధరల ప్రభావం

టోకు ధరల ద్రవ్యోల్బణం పెరుగుదలకు మినరల్ ఆయిల్స్, ముడి పెట్రోలియం, సహజ వాయువు, విద్యుత్, ఆహార పదార్థాలు, ప్రాథమిక లోహాలు, రసాయనాలు, ఆహార ఉత్పత్తుల ధరల పెరుగుదల ప్రధాన కారణాలుగా మంత్రిత్వ శాఖ పేర్కొంది. అక్టోబర్ నెలకు సంబంధించిన ద్రవ్యోల్బణ గణాంకాలు తాత్కాలికమైనవని, 81.1 శాతం వెయిటెడ్ రెస్పాన్స్ రేటు ఆధారంగా వీటిని రూపొందించినట్లు వివరించింది.

భారత్-జపాన్ బంధానికి ఇదే సరైన సమయం!

టోక్యో: మారుతున్న అంతర్జాతీయ పరిస్థితులు భారత్, జపాన్ దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకునేందుకు సరికొత్త అవకాశాలను కల్పిస్తున్నాయని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ, ఆర్థిక అనిశ్చితులు పెరుగుతున్న నేపథ్యంలో విశ్వసనీయ భాగస్వామ్యాలకు ప్రాధాన్యం పెరిగిందని పేర్కొన్నారు. భారత్, జపాన్ పరస్పర సహకారాన్ని విస్తరించుకోవడానికి ఇదే సరైన సమయమని స్పష్టం చేశారు. జపాన్ రాజధాని టోక్యోలో నిర్వహించిన 'రైసినా టోక్యో--2026' ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.



ప్రపంచ వ్యవస్థలో ఐదు కీలక మార్పులు

ప్రస్తుత ప్రపంచ వ్యవస్థను ప్రభావితం చేస్తున్న ఐదు ప్రధాన పరిణామాలను జైశంకర్ వివరించారు. అంతర్జాతీయ వ్యవస్థకు వరుసగా ఎదురవుతున్న సంక్షోభాలు, వనరులు--సాంకేతికతను వ్యూహాత్మక ఆయుధాలుగా ఉపయోగించడం, దేశాల మధ్య పెరుగుతున్న పోటీతత్వం, ఆర్థిక నష్టాలను తగ్గించుకునే ప్రయత్నాలు, విశ్వసనీయ భాగస్వామ్యాల ప్రాధాన్యం పెరగడం వంటివి ఇందులో ఉన్నాయని తెలిపారు. కొవిడ్ మహమ్మారి, ప్రధాన యుద్ధాలు, వాణిజ్య అంతరాయాలు, ఆర్థిక అస్థిరత వంటి పరిణామాలు ప్రపంచ వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని చెప్పారు. గతంలో ప్రపంచీకరణ ద్వారా ఏర్పడిన సరఫరా వ్యవస్థలు ఇప్పుడు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయని అభిప్రాయపడ్డారు.

వనరులే వ్యూహాత్మక ఆయుధాలు

ఇంధనం, సహజ వనరులు, మార్కెట్ ప్రాప్యత, సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక వ్యవస్థలను దేశాలు వ్యూహాత్మక సాధనాలుగా ఉపయోగిస్తున్నాయని జైశంకర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ పోటీ కేవలం ఆర్థిక రంగానికే పరిమితం కాకుండా అనేక రంగాలకు విస్తరిస్తోందన్నారు. దేశాలు తమ ఆధిపత్యాన్ని పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని వివరించారు.

విశ్వసనీయ భాగస్వామ్యాలకే ప్రాధాన్యం

ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో దేశాలు, వ్యాపార సంస్థలు తమ సరఫరా వ్యవస్థల్లో మార్పులు చేసుకుంటున్నాయని జైశంకర్ తెలిపారు. గతంలో తక్కువ ఖర్చు, అధిక సామర్థ్యానికి ప్రాధాన్యం ఇచ్చేవారని, ప్రస్తుతం విశ్వసనీయత, ప్రత్యామ్నాయ సరఫరా మార్గాలు, భద్రతకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. నిబంధనలను స్వార్థ ప్రయోజనాల కోసం ఉపయోగించే ధోరణులను ఎదుర్కొంటూ, నిబంధనలను నిజాయితీగా పాటించే దేశాలకు నష్టం జరగకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు.

భారత అభివృద్ధిని గుర్తించాలి

2014 నుంచి భారత్‌లో చోటుచేసుకున్న ఆర్థిక, సాంకేతిక, మౌలిక సదుపాయాల అభివృద్ధిని జపాన్ గుర్తించాలని జైశంకర్ సూచించారు. భారతదేశంలో విస్తరిస్తున్న దేశీయ మార్కెట్, మెరుగుపడుతున్న మౌలిక సదుపాయాలు జపాన్ కంపెనీలకు మంచి అవకాశాలను కల్పిస్తున్నాయని తెలిపారు. తయారీ, ఉత్పత్తి రంగాల్లో పెట్టుబడులు పెట్టాలనుకునే జపాన్ సంస్థలకు భారత్ ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారిందని వివరించారు.

పలు రంగాల్లో విస్తృత సహకారానికి అవకాశం

విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, డిజిటల్ టెక్నాలజీ, అంతరిక్షం, డ్రోన్లు, ఆరోగ్య సంరక్షణ, రక్షణ రంగాల్లో భారత్ గణనీయమైన పురోగతి సాధిస్తోందని జైశంకర్ వివరించారు. ఈ రంగాల్లో జపాన్‌తో కలిసి పనిచేయడానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

ముఖ్యంగా తయారీ, సెమీకండక్టర్లు, కీలక ఖనిజాలు, సమాచార సాంకేతికత, స్వచ్ఛ ఇంధనం, ఔషధ తయారీ రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత విస్తరించాలని పిలుపునిచ్చారు.

రక్షణ, భద్రతా రంగాల్లో మరింత బలం

భారత్, జపాన్ మధ్య రక్షణ, భద్రతా సంబంధాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని విదేశాంగ మంత్రి స్పష్టం చేశారు. ఇందుకోసం సమర్థవంతమైన విధానాలు, సహకార వ్యవస్థలను అభివృద్ధి చేయాలని సూచించారు. రెండు దేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు, పరస్పర విశ్వాసం భవిష్యత్తులో మరిన్ని అవకాశాలకు మార్గం సుగమం చేస్తాయని అభిప్రాయపడ్డారు.

ప్రాంతీయ, ప్రపంచ స్థిరత్వానికి దోహదం

భారత్, జపాన్ మధ్య సుదీర్ఘకాలంగా స్నేహపూర్వక సంబంధాలు కొనసాగుతున్నాయని జైశంకర్ గుర్తుచేశారు. ఇరు దేశాల మధ్య బలమైన ద్వైపాక్షిక భాగస్వామ్యం కేవలం ఆర్థిక ప్రయోజనాలకే పరిమితం కాకుండా ఆసియా ప్రాంతంతోపాటు ప్రపంచ స్థిరత్వానికి కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు.

మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది లతీఫ్ భట్ హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద వ్యతిరేక పోరులో భద్రతా బలగాలు కీలక విజయాన్ని సాధించాయి. లష్కరే తయ్యిబాకు చెందిన మోస్ట్ వాంటెడ్ కమాండర్ లతీఫ్ భట్‌ను భద్రతా దళాలు హతమార్చాయి. కశ్మీర్‌లో క్రియాశీలంగా ఉన్న చివరి స్థానిక లష్కరే తయ్యిబా ఉగ్రవాదిగా భావిస్తున్న అతడి కోసం భద్రతా సంస్థలు కొంతకాలంగా గాలిస్తున్నాయి. ఇటీవల కుల్గాం జిల్లాలో సీఆర్‌పీఎఫ్ సిబ్బందిపై జరిగిన కాల్పుల ఘటనలో అతడి ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టిన భద్రతా బలగాలు అతడి ఆచూకీని గుర్తించి మట్టుబెట్టాయి.

మసీదులో తలదాచుకున్న ఉగ్రవాది

లతీఫ్ భట్ భద్రతా బలగాల నుంచి తప్పించుకునే క్రమంలో ఓ మసీదులోకి ప్రవేశించినట్లు పోలీసులు వెల్లడించారు. అతడిని బయటకు తీసుకొచ్చేందుకు అధికారులు తొలుత లొంగుబాటుకు అవకాశం కల్పించారు. వీడియో కాల్ ద్వారా సంప్రదించి ఆయుధాలు విడిచిపెట్టి లొంగిపోవాలని కోరారు. లొంగిపోతే ఎలాంటి హాని జరగకుండా చూస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. అయితే అధికారుల విజ్ఞప్తిని అతడు తిరస్కరించడంతో భద్రతా బలగాలు ఆపరేషన్ కొనసాగించాయి. చివరకు అతడిని హతమార్చాయి. ఈ ఘటనలో మసీదుకు ఎలాంటి నష్టం జరగలేదని పోలీసులు స్పష్టం చేశారు.

నవంబర్ 16న తప్పించుకుని.. చివరకు హతం

కుల్గాం జిల్లాలోని లారూ ప్రాంతంలో నవంబర్ 16న భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో లతీఫ్ భట్ బుల్లెట్ గాయాలతో తప్పించుకున్నట్లు సమాచారం. ఇదే ఆపరేషన్‌లో మరో ఉగ్రవాది ఉమర్ నాసిర్ దార్ హతమయ్యాడు. దీంతో లతీఫ్ కోసం భద్రతా బలగాలు గాలింపును మరింత ముమ్మరం చేశాయి. సైన్యం, సీఆర్‌పీఎఫ్, స్థానిక పోలీసులు సంయుక్తంగా అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. చివరకు అతడి కదలికలను గుర్తించి చుట్టుముట్టాయి.

అమిత్ షా ప్రశంసలు

ఈ ఆపరేషన్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. జమ్మూకశ్మీర్ పోలీసులు, భారత సైన్యం, సీఆర్‌పీఎఫ్ బలగాలు అత్యున్నత సమన్వయంతో ఆపరేషన్ నిర్వహించాయని ప్రశంసించారు. దేశ భద్రత కోసం ధైర్యసాహసాలు ప్రదర్శించిన జవాన్లకు దేశం వందనం చేస్తోందని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. మరోవైపు సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ జి.పి. సింగ్ కూడా భద్రతా బలగాలను అభినందించారు. ఈ ఆపరేషన్ 2026లో కీలక విజయాల్లో ఒకటిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

సీజేఐపై అనుచిత వ్యాఖ్యలు.. న్యాయవాదికి సుప్రీంకోర్టు ధిక్కరణ నోటీసులు

న్యూఢిల్లీ: భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన న్యాయవాదికి సుప్రీంకోర్టు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌బీఏ) దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం విచారణ చేపట్టిన ధర్మాసనం.. సదరు న్యాయవాది వివరణ ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను 2027 జనవరి 20కు వాయిదా వేసింది. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి, జస్టిస్ వి. మోహనతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. పిటిషన్‌తో పాటు అటార్నీ జనరల్ ఇచ్చిన సమ్మతిని కూడా పరిశీలించినట్లు తెలిపింది. కోర్టు ధిక్కరణ చట్టంలోని సెక్షన్ 15(1)(బి) ప్రకారం అటార్నీ జనరల్ అనుమతి లభించిన నేపథ్యంలో.. సంబంధిత న్యాయవాదిపై ధిక్కరణ చర్యలు ప్రారంభించేందుకు ఎస్‌బీఏ చేసిన అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రాథమికంగా అభిప్రాయపడింది. ఈ మేరకు నోటీసులు జారీ చేసింది.

కోర్టు విచారణలోనే వివాదం

సోమవారం సుప్రీంకోర్టులో ఈ ఘటన చోటుచేసుకుంది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బాగ్చి, జస్టిస్ మోహనలతో కూడిన ధర్మాసనం విచారణకు సమావేశమైన సమయంలో ఓ న్యాయవాది తన వాదనలు అత్యవసరంగా వినాలని కోరారు. న్యాయవ్యవస్థలో అవినీతి జరుగుతోందంటూ తాను చేసిన ఆరోపణలపై కోర్టు స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై నవంబర్ 2న సీజేఐ కార్యాలయానికి లేఖ పంపినా సమాధానం రాలేదని పేర్కొంటూ.. వెంటనే విచారణ చేపట్టాలని పట్టుబట్టారు. ఈ సందర్భంగా జస్టిస్ మోహన స్పందిస్తూ.. ఇలాంటి అంశాలను ప్రస్తావించడానికి ఇది సరైన విధానం కాదని హెచ్చరించారు. అయినప్పటికీ న్యాయవాది తన వాదనను కొనసాగించారు. దీంతో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ.. 'మేము పరిశీలిస్తాం, మీరు వేచి ఉండండి' అని సూచించారు.

సీజేఐ పదవిపై అభ్యంతరకర వ్యాఖ్యలు

అయితే న్యాయవాది వెనక్కి తగ్గకుండా సీజేఐపై తీవ్ర వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. 'నేను వేచి ఉండను. మీరు ఆ కుర్చీలో కూర్చోవడానికి అర్హులు కాదు. ఆ పదవికి తగిన నిజాయతీ మీకు లేదు' అంటూ వ్యాఖ్యానించారు. ఈ పరిణామంతో కొంతసేపు కోర్టు వర్చువల్ విచారణలకు అంతరాయం ఏర్పడింది. అనంతరం భద్రతా సిబ్బంది సదరు న్యాయవాదిని కోర్టు హాలు నుంచి బయటకు తీసుకెళ్లారు.

ధిక్కరణ చర్యలకు బార్ అసోసియేషన్ విజ్ఞప్తి

ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్.. సంబంధిత న్యాయవాదిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసింది. అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది ప్రదీప్ రాయ్ ఈ పిటిషన్ తరఫున వాదనలు వినిపించారు. న్యాయస్థానంలో ఈ తరహా ప్రవర్తన పూర్తిగా ఆమోదయోగ్యం కాదని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అటార్నీ జనరల్ సమ్మతి నేపథ్యంలో ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.

భారత్ వ్యతిరేక ప్రచారానికి రాహుల్‌గాంధీ నాయకత్వం

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ భారత్ వ్యతిరేక ప్రచారానికి నాయకత్వం వహిస్తున్నారని బీజేపీ నేతలు తీవ్రంగా ఆరోపించారు. అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీలో భారత ఆర్థిక వ్యవస్థపై రాహుల్ చేసిన వ్యాఖ్యలను తప్పుబడుతూ విమర్శలు గుప్పించారు. ప్రపంచ దేశాలు భారత్‌ను వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా గుర్తిస్తుంటే, రాహుల్ మాత్రం విదేశీ వేదికలపై దేశ ప్రతిష్ఠను దెబ్బతీసేలా మాట్లాడుతున్నారని బీజేపీ నేత ఆశిశ్ ఉషా అగర్వాల్ మండిపడ్డారు. రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లిన ప్రతిసారీ తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని ఆశిశ్ ఉషా అగర్వాల్ ఎక్స్ వేదికగా విమర్శించారు. భారతదేశ ప్రగతిని దెబ్బతీయడం, అంతర్జాతీయంగా దేశ ప్రతిష్ఠను బలహీనపరచడమే ఆయన ఉద్దేశమని ఆరోపించారు. భారత్ ప్రధాన అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా కొనసాగుతోందని, అయినప్పటికీ రాహుల్ విదేశీ గడ్డపై దేశాన్ని ఆర్థిక సంక్షోభంలో ఉన్నట్లుగా చిత్రీకరిస్తున్నారని పేర్కొన్నారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్), రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) దేశ వృద్ధి రేటుపై సానుకూల అంచనాలు వెల్లడించాయని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారత్ వృద్ధి రేటు 7 నుంచి 7.1 శాతం మధ్య ఉండవచ్చని అంచనా వేసినట్లు తెలిపారు. గోల్డ్‌మన్ శాక్స్ సైతం దేశ జీడీపీ వృద్ధిని 6.9 శాతంగా అంచనా వేసిందని పేర్కొన్నారు. మౌలిక సదుపాయాలు, డిజిటల్ పరివర్తన రంగాల్లో భారత్ పురోగమిస్తున్న సమయంలో ప్రతికూల వ్యాఖ్యలు చేయడం ఎందుకని ప్రశ్నించారు.

'భారతదేశపు మీర్ జాఫర్' అంటూ భాటియా విమర్శలు

అంతర్జాతీయ వేదికలపై దేశాన్ని అప్రతిష్ఠపాలు చేయాలనే ఉద్దేశంతోనే రాహుల్ గాంధీ ఈ వ్యాఖ్యలు చేస్తున్నారని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా ఆరోపించారు. రాహుల్‌ను 'భారతదేశపు మీర్ జాఫర్'గా అభివర్ణిస్తూ, ఆయన వ్యాఖ్యలు దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయని విమర్శించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తి జాతీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని వ్యవహరించాలని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలకు ముందు రాహుల్ గాంధీ అమెరికా పర్యటనకు వెళ్లడాన్ని గౌరవ్ భాటియా ప్రస్తావించారు. పార్లమెంట్ సమావేశాలకు ముందు విదేశీ పర్యటనలు చేయడం ఆయనకు అలవాటుగా మారిందని విమర్శించారు. విదేశీ శక్తుల నుంచి సలహాలు, సూచనలు తీసుకోవడానికే ఆయన అక్కడికి వెళ్తున్నారా అని ప్రశ్నించారు. గతంలో జార్జ్ సోరోస్, ఇల్హాన్ ఒమర్ వంటి వారితో రాహుల్ జరిపిన భేటీలను ప్రస్తావిస్తూ, భారత్‌ను బలహీనపరిచే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.

గ్రీన్ ఎనర్జీకి పెద్దపీట..

-మొదటిపేజీ తరువాయి

18.23 శాతం పెరిగినట్లు వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావం సహా వాతావరణ పరిస్థితులు విద్యుత్ డిమాండ్‌పై ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. రానున్న ఆరు నెలల్లో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 14,852 మెగావాట్లకు చేరే అవకాశం ఉందని అంచనా వేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కోతలు లేకుండా నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని సీఎం ఆదేశించారు.

రూ.21,838 కోట్లతో గ్రీన్ ఎనర్జీ కారిడార్

పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలను బలోపేతం చేసేందుకు రూ.21,838 కోట్ల వ్యయంతో గ్రీన్ ఎనర్జీ కారిడార్-3 ప్రణాళికలను సిద్ధం చేసినట్లు అధికారులు వివరించారు. ఈ కారిడార్ ద్వారా 47 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్‌ను సరఫరా చేసే సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి పెరిగే కొద్దీ వాటిని గ్రిడ్‌కు అనుసంధానించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

36,050 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు

రాష్ట్రవ్యాప్తంగా 36,050 మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులను చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిలో హెచ్చుతగ్గులు



ఉన్నప్పుడు విద్యుత్ సరఫరాను సమతుల్యం చేసేందుకు ఈ ప్రాజెక్టులు ఉపయోగపడతాయని వివరించారు. ప్రాజెక్టుల అనుమతులు, నిర్మాణ ప్రక్రియలను వేగవంతం చేసి నిర్దిష్ట కాలపరిమితిలో పనులు పూర్తయ్యేలా చూడాలని సీఎం ఆదేశించారు.

9 లక్షల సోలార్ కనెక్షన్ల లక్ష్యం

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ పథకాన్ని రాష్ట్రంలో విస్తృతంగా అమలు చేయాలని సమీక్షలో నిర్ణయించారు. ఈ నెలాఖరు నాటికి తొమ్మిది లక్షల సోలార్ కనెక్షన్లు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు అధికారులు తెలిపారు. గృహాలపై రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థల ఏర్పాటును ప్రోత్సహించి, ప్రజలకు విద్యుత్ ఖర్చు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

ఇంధన రంగంలో రూ.4.20 లక్షల కోట్ల పెట్టుబడులు

రాష్ట్రంలో ఇంధన రంగానికి పెట్టుబడులు పెరుగుతున్నాయని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. 2024 జూన్ నుంచి ఇప్పటివరకు 103 విద్యుత్ ప్రాజెక్టులకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, వీటి ద్వారా రూ.4.20 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని వివరించారు. విశాఖపట్నంలో నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో విద్యుత్ రంగానికి సంబంధించి మరో రూ.2.56 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు కుదిరినట్లు తెలిపారు.

ఒప్పందాలు కార్యరూపం దాల్చాలి

పెట్టుబడుల ఒప్పందాలు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా వాస్తవ ప్రాజెక్టులుగా మారాలని చంద్రబాబు స్పష్టం చేశారు. అనుమతులు, భూసేకరణ, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాల్లో సమన్వయంతో ముందుకు వెళ్లాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల నిర్మాణ పనులను వేగవంతం చేసి, రాష్ట్ర విద్యుత్ అవసరాలకు దీర్ఘకాలిక పరిష్కారాలు చూపాలని సూచించారు. సంప్రదాయ ఇంధన వనరులపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గిస్తూ, పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే దిశగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

సెమీకండక్టర్ హబ్‌గా ఏపీ..

-మొదటిపేజీ తరువాయి

ఈ విధానం కింద సిలికాన్ ఫ్యాబ్‌ల ఏర్పాటుకు కేంద్రం, రాష్ట్రం కలిపి 80 శాతం వరకు పెట్టుబడి రాయితీ అందిస్తాయని పేర్కొన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఇది అత్యధిక ప్రోత్సాహకమని ఆయన తెలిపారు. డిస్‌ప్లే, కాంపౌండ్ సెమీకండక్టర్ ఫ్యాబ్‌లకు 70 శాతం వరకు ప్రోత్సాహకాలు కల్పిస్తామని వెల్లడించారు.

తిరుపతిలో 5 వేల ఎకరాల్లో పార్క్

సెమీకండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఒకే ప్రాంతంలో అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా తిరుపతిలో 5 వేల ఎకరాల విస్తీర్ణంలో ప్రత్యేక సెమీకండక్టర్ పార్క్‌ను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. పరిశ్రమలకు అవసరమైన భూమి, విద్యుత్, నీరు, రవాణా సదుపాయాలతో పాటు వేగవంతమైన అనుమతుల కోసం సింగిల్ విండో వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

ఇండియా సెమీకండక్టర్ మిషన్-2కు అనుగుణంగా



కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న రెండో దశ ఇండియా సెమీకండక్టర్ మిషన్‌కు అనుగుణంగా రాష్ట్ర సెమీకండక్టర్ విధానాన్ని సవరించినట్లు లోకేశ్ చెప్పారు. అంతర్జాతీయ పెట్టుబడిదారులను ఆకర్షించడంతో పాటు దేశీయంగా చిప్ తయారీ సామర్థ్యాన్ని పెంచేందుకు ఈ విధానం దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వివరించారు.

యువతకు ప్రత్యేక శిక్షణ.. నెలకు రూ.10 వేలు

సెమీకండక్టర్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యమున్న మానవ వనరులను తయారు చేయడంపైనా ప్రభుత్వం దృష్టి పెట్టింది. యువతకు ఈ రంగంలో ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు మంత్రి తెలిపారు. శిక్షణ పొందే ఒక్కో అభ్యర్థికి నెలకు రూ.10 వేల చొప్పున ప్రోత్సాహకం అందిస్తామని ప్రకటించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు.

దేశీయ చిప్ తయారీకి ఏపీ వేదిక

భారత్ తన అవసరాలకు సంబంధించిన చిప్‌లను దేశంలోనే తయారు చేసుకునే స్థాయికి ఎదగాల్సిన అవసరం ఉందని లోకేశ్ పేర్కొన్నారు. ఆ లక్ష్య సాధనలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషించేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. చిప్ తయారీ, ప్యాకేజింగ్, పరిశోధన, సాంకేతిక అభివృద్ధి వంటి విభాగాలను ఒకే పారిశ్రామిక వ్యవస్థగా అనుసంధానించి రాష్ట్రాన్ని అంతర్జాతీయ సెమీకండక్టర్ రంగంలో కీలక కేంద్రంగా నిలబెట్టేందుకు కృషి చేస్తామని వెల్లడించారు.

ఇన్సూరెన్స్ లేని వాహనాలకు టోల్ వద్దే చెక్!

అమరావతి : వాహనాలకు తప్పనిసరిగా ఉండాల్సిన థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించేందుకు చర్యలు చేపడుతోంది. బీమా గడువు ముగిసిన లేదా ఇన్సూరెన్స్ లేని వాహనాలను జాతీయ రహదారులపై టోల్ ప్లాజాల వద్దే గుర్తించే విధానాన్ని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. ఈ విధానంలో వాహనం టోల్ ప్లాజా దాటగానే దాని బీమా వివరాలను వాహన్ డేటాబేస్‌తో పరిశీలించి, పాలసీ గడువు ముగిసినట్లయితే యజమానికి ఎస్ఎంఎస్ పంపిస్తారు. ఈ నేపథ్యంలో వాహనదారులు తమ ఇన్సూరెన్స్ గడువును ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని ఏపీ రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సూచించారు.

టోల్ దాటగానే బీమా వివరాల తనిఖీ

ప్రస్తుతం వాహనానికి ఇన్సూరెన్స్ ఉందా లేదా అనే విషయం సాధారణంగా తనిఖీల సమయంలోనే బయటపడుతోంది. కొత్త విధానం అమల్లోకి వస్తే టోల్ ప్లాజా దాటిన వెంటనే వాహనం రిజిస్ట్రేషన్ వివరాలను వాహన్ డేటాబేస్‌లో పరిశీలిస్తారు. ఆ వాహనానికి చెల్లుబాటయ్యే థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ ఉందా లేదా అనేది ఆటోమేటిక్‌గా తనిఖీ చేస్తారు. పాలసీ గడువు ముగిసినట్లు గుర్తిస్తే వాహన యజమాని రిజిస్టర్ చేసుకున్న మొబైల్ నంబర్‌కు ఎస్ఎంఎస్ పంపిస్తారు.

దిల్లీలో ప్రయోగాత్మకంగా అమలు

దిల్లీలోని ముండ్కా టోల్ ప్లాజా వద్ద ఎన్‌హెచ్ఏఐ ఈ



విధానాన్ని పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించింది. వాహనాల వివరాలను నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) నిర్వహించే వాహన్ డేటాబేస్‌తో అనుసంధానించి బీమా స్థితిని పరిశీలిస్తున్నారు. ఇన్సూరెన్స్ గడువు ముగిసిన వాహనాలకు రిజిస్ట్రేషన్ నంబర్, టోల్ దాటిన సమయం, బీమా గడువు ముగిసిన తేదీ వంటి వివరాలతో సందేశం పంపిస్తారు. ప్రస్తుతం ఇది ప్రయోగాత్మక దశలోనే ఉంది. దేశవ్యాప్తంగా ఎప్పటి నుంచి అమలు చేస్తారనే తేదీని ఎన్‌హెచ్ఏఐ ఇంకా ప్రకటించలేదు.

థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ తప్పనిసరి

మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 146 ప్రకారం రోడ్లపై తిరిగే వాహనాలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ తప్పనిసరి. ప్రమాదాల్లో ఇతరులకు గాయాలు, ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం జరిగితే బాధితులకు పరిహారం అందించడంలో ఈ బీమా కీలక పాత్ర పోషిస్తుంది. అందువల్ల ప్రతి వాహన యజమాని తన పాలసీ గడువును పరిశీలించుకోవాలని, గడువు ముగియకముందే రెన్యువల్ చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

జరిమానాలు భారీగా పెంపు

ఇన్సూరెన్స్ లేకుండా వాహనం నడిపితే మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 196 ప్రకారం జరిమానా విధిస్తారు. 2026 ఆగస్టు 15 నుంచి అమల్లోకి వచ్చిన సవరణ ప్రకారం మొదటిసారి ఉల్లంఘనకు వాహనం బేస్ ప్రీమియానికి మూడు రెట్లు లేదా రూ.5,000ల్లో ఏది ఎక్కువైతే ఆ మొత్తాన్ని జరిమానాగా చెల్లించాలి. రెండోసారి లేదా ఆ తర్వాత ఉల్లంఘనకు బేస్ ప్రీమియానికి ఐదు రెట్లు లేదా రూ.10,000ల్లో ఏది ఎక్కువైతే ఆ మొత్తం జరిమానాగా విధిస్తారు.

గడువు ముగియకముందే రెన్యువల్ చేసుకోండి

వాహనదారులు ఇన్సూరెన్స్ గడువు ముగిసిన తర్వాత నిర్లక్ష్యం చేయకుండా ముందుగానే రెన్యువల్ చేసుకోవాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సూచించారు. బీమా లేకుండా వాహనాలు నడిపి జరిమానాలు, చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కోవద్దని కోరారు. సురక్షిత ప్రయాణంతో పాటు రోడ్డు ప్రమాద బాధితులకు ఆర్థిక భరోసా కల్పించడంలో థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ కీలకమని పేర్కొన్నారు. రవాణా శాఖ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వాహనదారులకు విజ్ఞప్తి చేశారు.

తిరుమల శ్రీవారి భక్తులకు అలర్ట్

వైకుంఠ ద్వార దర్శనాలు ఎప్పటి నుంచి అంటే..!

తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబర్ 20 నుంచి 29వ తేదీ వరకు భక్తులకు వైకుంఠ ద్వార దర్శనాలను కల్పించనున్నారు. పరమ పవిత్రమైన వైకుంఠ ద్వార దర్శనాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ 10 రోజుల వ్యవధిలో మొత్తం 8.34 లక్షల మంది భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించేలా ప్రణాళికలు రూపొందించినట్లు టీటీడీ సాధికారిక మండలి ఛైర్మన్ ముద్దాడ రవిచంద్ర వెల్లడించారు. తిరుమల అన్నమయ్య భవనంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన సాధికారిక మండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ముద్దాడ రవిచంద్ర మాట్లాడుతూ, వైకుంఠ ద్వార దర్శనాల్లో సామాన్య భక్తులకే అత్యధికంగా 92 శాతం ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాలకు సంబంధించిన ఎస్ఎస్‌డీ టోకెన్లను ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు తెలిపారు. తొలి రెండు రోజులు ఎలాంటి సర్వదర్శనం ఉండదని, ఆ తర్వాతి 8 రోజుల పాటు భక్తులకు సర్వదర్శనం అమలు చేస్తామని వివరించారు. భక్తుల సౌకర్యార్థం అలిపిరి--ఎస్వీ జూ పార్క్ రోడ్డు సమీపంలోని టీటీడీ స్థలంలో శ్రీవాణి ట్రస్ట్ నిధులు రూ.2,750 కోట్లతో అత్యాధునిక యాత్రికుల టౌన్‌షిప్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్టు డీపీఆర్, డిజైన్ల తయారీ, పర్యవేక్షణ కోసం ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థను ఎంపిక చేయాలని బోర్డు నిర్ణయించింది. అలాగే శ్రీనివాస మంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి శ్రీవారిమెట్టు వరకు రహదారి అభివృద్ధి, ఇంటర్‌లాకింగ్ సిమెంట్ బ్లాక్‌ల నిర్మాణం కోసం రూ.9.50 కోట్లు మంజూరు చేశారు. అలిపిరి నడకమార్గంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి మోకాళ్లమిట్ట వరకు రోడ్డుపై నడిచివచ్చే భక్తుల కోసం ఐఐటీ నిపుణుల సహకారంతో కేబుల్ బ్రిడ్జి నిర్మాణ సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉద్యోగులకు అందించే ప్రోత్సాహక బహుమానాన్ని ఖరారు చేశారు. శాశ్వత ఉద్యోగులకు రూ.16,940, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి రూ.8,289 చొప్పున చెల్లించనున్నారు. 2007 సీనియారిటీ జాబితా ప్రకారం ఫేజ్-3 పరిధిలోని రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి వారసులకు పల్లం గ్రామంలో ఇంటి ప్లాట్లు కేటాయించేందుకు ఆమోదం తెలిపారు. మిగిలిన అర్హుల పరిశీలనకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నారు. పాదిరేడు లేఅవుట్ అభివృద్ధికి సంబంధించి గతంలో కేటాయించిన రూ.230 కోట్ల ధ్రువీకరణకు మండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు పరిహారంతో పాటు, భవిష్యత్తులో అర్హులైన ఉద్యోగుల కుటుంబాలకు కనీసం రూ.10 లక్షల ఆర్థిక ప్రయోజనం దక్కేలా నూతన సంక్షేమ విధానాన్ని తీసుకురానున్నారు. పేద రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు, పాత బకాయిల చెల్లింపులకు గాను స్విమ్స్ ఆసుపత్రికి అదనంగా రూ.41.23 కోట్ల ప్రత్యేక గ్రాంటును కేటాయించారు. ఎస్వీ ఆయుర్వేద కళాశాలలో బీఏఎంఎస్ సీట్లను 40 నుంచి 60కి పెంచారు.

ఉత్తరాంధ్రకు రెడ్ అలర్ట్



-మొదటిపేజీ తరువాయి

ముందుకు కదులుతూ ఉత్తరాంధ్ర, యానాం, దక్షిణ ఒడిశా తీరాల మధ్య తీరం దాటవచ్చని అంచనా.

ఉత్తరాంధ్రలో వర్ష సూచన

తుపాను ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. శ్రీకాకుళం జిల్లాలో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురిసే సూచనలున్నాయి. తీర ప్రాంతాల్లో బలమైన గాలులు వీచే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

సహాయక బృందాలు సిద్ధం

తుపాను కదలికను ఆర్టీజీఎస్, విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. జిల్లా యంత్రాంగాలకు ఎప్పటికప్పుడు సూచనలు అందిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు 13 ఎన్డీఆర్ఎఫ్, 11 ఎస్డీఆర్ఎఫ్ బృందాలతో పాటు అగ్నిమాపక సిబ్బందిని సిద్ధంగా ఉంచినట్లు అధికారులు వెల్లడించారు. అవసరమైన చోట ముందస్తు సహాయక చర్యలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తుపాను ప్రభావం దృష్ట్యా అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని, ఇప్పటికే సముద్రంలో ఉన్నవారు తీరానికి చేరుకోవాలని సూచిస్తున్నారు. రైతులు పంటలను కాపాడుకునేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, కోతకు సిద్ధంగా ఉన్న పంటలను సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని సూచిస్తున్నారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో ప్రజలు అధికారుల సూచనలు పాటించాలని విపత్తుల నిర్వహణ సంస్థ కోరుతోంది.

తుపాను గమనంపై నిరంతర నిఘా

అక్వాన్ తుపాను తీరం దాటే ప్రాంతం, తీవ్రత, వర్షపాతం అంచనాలపై వాతావరణ శాఖ ఎప్పటికప్పుడు బులెటిన్లు విడుదల చేస్తోంది. పరిస్థితులకు అనుగుణంగా జిల్లాల వారీగా హెచ్చరికలు, సహాయక చర్యల్లో మార్పులు చేసే అవకాశం ఉంది. ప్రజలు వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారాన్ని మాత్రమే అనుసరించాలని యంత్రాంగం సూచిస్తోంది.

ఏపీలో నేటి నుంచి స్థానిక సంస్థలకు కొత్త పాలకవర్గాలు



-మొదటిపేజీ తరువాయి

కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా నోటిఫికేషన్ జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 659 మండలాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించారు. 9 వేలకుపైగా ఎంపీటీసీ స్థానాలు, 659 జడ్పీటీసీ స్థానాలకు ఈ నెల 5న పోలింగ్ జరిగింది. తుపాను ప్రభావం, రీపోలింగ్ కారణంగా కొన్ని ప్రాంతాల్లో నవంబర్ 6న కూడా ఓటింగ్ నిర్వహించారు. నవంబర్ 7న ఓట్ల లెక్కింపు పూర్తి చేసి ఫలితాలు ప్రకటించారు. తాజాగా ఎంపీపీ, వైస్ ఎంపీపీ, జడ్పీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలకు తేదీలను ఖరారు చేస్తూ ఎస్ఈసీ నోటిఫికేషన్ విడుదల చేసింది.

ఉదయం 10 గంటలకు ఎంపీపీ ఎన్నికల ప్రక్రియ

గురువారం ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికల కోసం ఉదయం 10 గంటలకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుంది. ఉదయం 11 గంటలకు నామినేషన్ల పరిశీలన చేపడతారు. ఒకటి కంటే ఎక్కువ నామినేషన్లు దాఖలైతే సంబంధిత పదవికి ఎన్నిక నిర్వహిస్తారు. పోటీ లేకపోతే మధ్యాహ్నం 12 గంటలకు ఏకగ్రీవ ఎన్నికను ప్రకటించి, అనంతరం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహిస్తారు.

రేపు జడ్పీ చైర్మన్లు, వైస్ చైర్మన్ల ఎంపిక

శుక్రవారం రాష్ట్రంలోని 28 జిల్లా పరిషత్‌లకు చైర్మన్లు, వైస్ చైర్మన్ల ఎన్నికలు నిర్వహించనున్నారు. సంబంధిత జడ్పీటీసీ సభ్యులు పరోక్ష పద్ధతిలో తమ ప్రతినిధులను ఎన్నుకుంటారు. ఎంపీపీలు, జడ్పీ చైర్మన్లతో పాటు వైస్ పదవులకు ఎన్నికైన వారి పదవీకాలం కూడా ఎన్నికైన రోజు నుంచే లెక్కించనున్నారు.

కో-ఆప్టెడ్ సభ్యుల ఎంపికకు ప్రత్యేక నిబంధనలు

ప్రతి మండల పరిషత్‌లో ఒక కో-ఆప్టెడ్ సభ్యుడిని, ప్రతి జిల్లా పరిషత్‌లో ఇద్దరు కో-ఆప్టెడ్ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం మతపరమైన మైనారిటీ వర్గాలకు లేదా భాషాపరమైన మైనారిటీ వర్గాలకు చెందిన అర్హులైన వ్యక్తులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. ముస్లిం, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ, పార్సీ మతాలకు చెందినవారు మతపరమైన మైనారిటీలుగా, తెలుగు కాకుండా ఇతర మాతృభాష కలిగినవారు భాషాపరమైన మైనారిటీలుగా పరిగణించబడతారు.

పార్టీ విప్ తప్పనిసరి

ఎంపీపీ, వైస్ ఎంపీపీ, జడ్పీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు జారీ చేసే విప్ నిబంధనలు వర్తిస్తాయి. అయితే కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నికకు పార్టీ విప్ వర్తించదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. సంబంధిత పరిషత్‌లలో ఎక్స్-అఫీషియో సభ్యులుగా ఉన్న ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు ప్రత్యేక సమావేశాలకు హాజరయ్యే అవకాశం ఉంటుంది. అయితే ఈ పరోక్ష ఎన్నికల్లో వారికి ఓటు హక్కు ఉండదు.

ఎన్నికల నిర్వహణకు అధికారుల ఏర్పాట్లు

ఎంపీపీ, వైస్ ఎంపీపీ, జడ్పీ చైర్మన్, వైస్ చైర్మన్, కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల అధికారులకు ఎస్ఈసీ ఆదేశాలు జారీ చేసింది. మండల స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించి, వారి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలని జిల్లా కలెక్టర్లకు సూచించింది. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీలకు ఆదేశాలు ఇచ్చింది.

మల్లేశ్వరం పంచాయతీ కూటమి అభ్యర్థిగా చెన్ను లక్ష్మి

బంటుమిల్లి నవంబర్ 18(మీ వార్త ప్రతినిధి)
బంటుమిల్లి మండలం మల్లేశ్వరం గ్రామ పంచాయతీ కూటమి సర్పంచ్ అభ్యర్థిగా చెన్ను శ్రీనివాస్ సతీమణి చెన్ను లక్ష్మి ని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఖరారు చేసినట్లు బంటుమిల్లి మండల పార్టీ ప్రెసిడెంట్ కూనపురెడ్డి వీరబాబు వెల్లడించారు. కూటమి తరపున లక్ష్మి పోటీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే నిర్ణయంతో పంచాయతీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిత్వంపై స్పష్టత వచ్చిందని పేర్కొన్నారు.
బంటుమిల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కూనపు రెడ్డి వీరబాబు ఉ కూటమి నాయకులు తెలిపారు. మహా కూటమి బలపరిచిన మల్లేశ్వరం గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా చెన్ను లక్ష్మి
బంటుమిల్లి మండలంలోని మల్లేశ్వరం గ్రామ సర్పంచ్ స్థానానికి ఎంపీ వల్లభనేని బాల సౌరీ, శాసన సభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ లు బలపరిచిన మహా కూటమి పార్టీ అభ్యర్థిగా చెన్ను లక్ష్మి ఖరారు అయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మి మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం పాలనలో పంచాయతీ రాజ్ వ్యవస్థలో బ్లీచింగ్, దోమల మందు కొట్టే పరిస్థితి లేక అప్పటి అధికార పార్టీ తరపున సర్పంచ్ లుగా గెలిచిన వారు తిరుమల విధుల్లో అర్ధ నగ్నంగా పంచాయతీలో కేంద్రం యిచ్చిన నిధులు సైతం కాజేస్తున్న అప్పటి ప్రభుత్వం పై నిరసన వ్యక్తం చేసారని. అప్పట్లో పంచాయతీ రాజ్ వ్యవస్థ 18 వ స్థానానికి పడిపోయి పూర్తిగా దారి తప్పిన పరిస్థితిలో మహా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రెండున్నర ఏళ్లలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సామర్థ్యం వల్ల 18 వ స్థానంలో నుండి పంచాయతీ రాజ్ శాఖ దేశంలోనే నెంబర్ 1 స్థానంకు చేరుకుంది అని అందువల్లనే నేడు పంచాయతీ ఎన్నికల్లో పోటీలో ఉన్న కూటమి అభ్యర్థులకు ప్రజల్లో మంచి ఆదరణ వస్తుంది అని అన్నారు. మల్లేశ్వరం గ్రామ ప్రజలకు 24 / 7 అందుబాటులో ఉంటూ ఎంపీ వల్లభనేని బాల సౌరీ, శాసన సభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ తనపై పెట్టుకున్న



నమ్మకం నిలబెట్టుకుంటానని అన్నారు. మల్లేశ్వరం కూటమి సర్పంచ్ అభ్యర్థిగా ఖరారు అయిన చెన్ను లక్ష్మి ను మహా కూటమి నాయకులు అభినందించారు.....

టీడీపీ జడ్పీటీసీ, ఎంపిటిసి సభ్యులను సత్కరించిన వలవల బాబ్జి





తాడేపల్లిగూడెం, నవంబర్ 18 (మీ వార్త ప్రతినిధి) తాడేపల్లిగూడెం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఇటీవల ఎన్నికైన తెలుగుదేశం పార్టీ జడ్పీటీసీ మరియు ఎంపిటిసి సభ్యులకు తాడేపల్లిగూడెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి, భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి) ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన జడ్పీటీసీ, ఎంపిటిసి సభ్యులను ఆయన శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు . వలవల బాబ్జి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తల కృషి వల్లే ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని, గ్రామాల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సన్మానం అందుకున్న సభ్యులకు ఆయన సూచించారు. ప్రతి గ్రామంలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని కోరారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో స్థానిక ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమని, పార్టీ బలోపేతానికి అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం జడ్పీటీసీ నేకూరి కిరణ్ కుమార్, ఎంపిటిసి సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో సత్సంగం, భజన కార్యక్రమం





విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో

మచిలీపట్నం నవంబర్ 18(మీ వార్త ప్రతినిధి)
29 మంది మహిళల భాగస్వామ్యం -- లక్కీ డిప్ ద్వారా ఎంపికైన రాధికకు అమ్మవారికి సమర్పించిన నూతన వస్త్రాల బహూకరణ
గ్రామీణ ప్రాంతాల్లో ధార్మిక చైతన్యాన్ని పెంపొందించడం, మహిళలను ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం, భక్తిభావంతో పాటు సామాజిక సమరసతను బలోపేతం చేయడం లక్ష్యంగా విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా శాఖ చేపడుతున్న ధార్మిక కార్యక్రమాల్లో భాగంగా బుధవారం రాత్రి 6:45 గంటలకు సర్కిల్‌పేటలోని శ్రీ సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో సత్సంగం, భజన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో 29 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. భక్తి గీతాలు, భజనలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. మహిళలు సమష్టిగా
భజనల్లో పాల్గొని భక్తి, ఆధ్యాత్మిక ఐక్యత, ధార్మిక సంప్రదాయాల పట్ల తమ ఆసక్తిని చాటుకున్నారు.ఈ సందర్భంగా విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా అధ్యక్షులు డా. బూరగడ్డ శ్రీనాథ్ అమ్మవారికి భక్తిపూర్వకంగా నూతన వస్త్రాలను సమర్పించారు. అనంతరం అమ్మవారికి సమర్పించిన ఆ నూతన వస్త్రాలను లక్కీ డిప్‌లో విజేతగా ఎంపికైన మహిళ రాధికకు కౌన్సిలర్ శ్రీమతి పంతం మహాలక్ష్మి బహూకరించారు.ధార్మిక కార్యక్రమాలు కేవలం పూజలు, భజనలకే పరిమితం కాకుండా మహిళలందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చే సామాజిక, ఆధ్యాత్మిక వేదికలుగా నిలవాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. కుటుంబాల్లో ధార్మిక విలువలు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించడంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా శాఖ గ్రామీణ ప్రాంతాల్లో దేవాలయాలను కేంద్రంగా చేసుకుని సత్సంగాలు, భజనలు, రుద్రార్చనలు, సింధూరార్చనలు, కుంకుమార్చనలు వంటి కార్యక్రమాలను నిర్వహిస్తోంది. వీటి ద్వారా మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడంతో పాటు కుల, వర్గ భేదాలకు అతీతంగా సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవం, సామాజిక సమరసతను పెంపొందించడమే ప్రధాన ఆశయంగా ముందుకు సాగుతోంది.గ్రామస్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో ఇటువంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ ధార్మిక చైతన్యాన్ని ప్రతి గ్రామానికి తీసుకెళ్లేందుకు విశ్వ హిందూ పరిషత్ కృష్ణ చేస్తోంది.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు శ్రీ జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం, శ్రీ రాజులపాటి అయ్యప్ప, ఆలయ పూజారి శ్రీ శేషు, శ్రీ పి. శ్రీనివాసరావు, శ్రీ సలాది రామకృష్ణ, శ్రీ చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.ధర్మ చైతన్యం న్ మహిళా భాగస్వామ్యం న్ సామాజిక సమరసత,అనే ఆశయంతో విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా శాఖ తన ధార్మిక కార్యక్రమాలను గ్రామగ్రామాన విస్తరిస్తోంది.

ఇందుర్తికి సొసైటీ మంజూరుపై మిన్నంటిన రైతుల సంబరాలు....

సీఎం రేవంత్ రెడ్డి,మంత్రి పొన్నం ప్రభాకర్, తుమ్మల చిత్రపటాలకు క్షీరాభిషేకం..

బ్యాండ్ బాజాలు,బాణాసంచా కాల్చి స్వీట్లు పంచిన కాంగ్రెస్ నాయకులు..





చిగురుమామిడి నవంబర్ 18 (మీ వార్త ప్రతినిధి సొన్నాయిల భరత్):
తెలంగాణ ప్రజా ప్రభుత్వం,ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావుల ప్రత్యేక చొరవతో చిగురుమామిడి మండలంలోని ఇందుర్తి గ్రామానికి నూతనంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మంజూరైంది.దశాబ్దాల కల నెరవేరడంతో ఇందుర్తి గ్రామ రైతులు, ప్రజలు,కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ ఘనంగా సంబరాలు జరుపుకున్నారు.కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అందే సురేష్ ఆధ్వర్యంలో గ్రామంలో పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్,తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటాలకు పాలాభిషేకం (క్షీరాభిషేకం)
నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం బ్యాండ్ బాజాల నడుమ బాణాసంచా కాల్చి, గ్రామస్తులకు స్వీట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇందుర్తికి పాక్స్ మంజూరు కావడం వల్ల చుట్టుపక్కల గ్రామాల రైతులకు ఎరువులు, విత్తనాలు, పంట రుణాలు సకాలంలో అందుతాయని, మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి మరువలేనిదని కొనియాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కు రుణపడి ఉంటామని రైతులు నాయకులు తెలిపారు.ఈ సంబరాల్లో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి,సర్పంచ్ చింతపూల నరేందర్ పటేల్,సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షులు మార్క రాజ్ కుమార్ గౌడ్, సీనియర్ నాయకులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి,గుళ్ళ రాజు,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఎండి.కుత్బుద్దీన్,పాక్స్ డైరెక్టర్లు చిట్యాల బాల్ రెడ్డి,చింతపూల సాయన్న,మాజీఎంపీటీసీ చీల లక్ష్మారెడ్డి,తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు కునచ్చుల మహేందర్, ఉపసర్పంచ్ ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి,సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ జిల్లెల్ల రమేష్,పచ్చిమట్ల జగన్,కతా తిరుపతి,గ్రామ శాఖ అధ్యక్షులు వంటకాల సంపత్ రెడ్డి,కూన బాలయ్య,అందె పరశురాములు,యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు రణప్రతాప్ సింగ్, బోయిని ప్రశాంత్,గొట్టే రఘు బాబు, బొడ్డు ప్రశాంత్,ఇందుర్తి వార్డు సభ్యులు షేక్ ఉమ్మర్, అందే బావికాడి బాబు,కూన మల్లయ్య,డాక్టర్ రాజేందర్, బుర్ర లక్ష్మణ్, కుట్ల శేను, పులి మణికంఠ,పెద్ద సంఖ్యలో రైతులు, గ్రామస్తులు,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు...

సందడి వాతావరణంలో పడమర విప్పర్రు సర్పంచ్ అభ్యర్థిగా పసల చంటి నామినేషన్ దాఖలు



పెంటపాడు నవంబర్ 18 (మీ వార్త ప్రతినిధి) మండలం లోని పడమర విప్పర్రు కూటమి సర్పంచ్ అభ్యర్థిగా పసల గంగా రామచంద్రరావు (చంటి) బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ నామినేషన్ కార్యక్రమానికి రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు పసల కొండ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పసల అచ్యుతం, బోనం శ్రీరామ్ మూర్తి, సంకుహరి తదితరులు హాజరై ఆయనకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా పడమర విప్పర్రు గ్రామం నుంచి పెంటపాడు గ్రామానికి భారీ సంఖ్యలో కూటమి నాయకులు, తెలుగుదేశం పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తరలివచ్చి జై పసల, జై జై పసల చంటి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పసల చంటి మాట్లాడుతూ సర్పంచ్ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టిడిపి ఇన్చార్జి వలవల బాబ్జి, బిజెపి నాయకులు ఈతకోట తాతాజీకి కృతజ్ఞతలు తెలిపారు. కూటమి నాయకులను సమన్వయం చేసుకుంటూ పడమర విప్పర్రు గ్రామ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలోని ప్రధాన సమస్య ఐన త్రాగునీటి సమస్యను పరిష్కరిస్తానన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసేవ చేస్తానన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ , ఎస్పీ



యర్రగొండపాలెం, నవంబర్ 18 (మీవార్త ప్రతినిధి):
మార్కాపురం మార్కెట్ యార్డులో నేడు నిర్వహించనున్న జెడ్పీ చైర్‌పర్సన్ నామినేషన్, ఎన్నిక, ప్రమాణ స్వీకార కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లను బుధవారం జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం విజయ సునీత తో కలసి జిల్లా ఎస్పీ శ్రీ పంకజ్ కుమార్ మీనా పరిశీలించారు.ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు, భద్రత, విధుల కేటాయింపు, అధికారుల సమన్వయం తదితర అంశాలను పరిశీలించి, ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు..

ఏపీ--ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో భారీ డంప్ స్వాధీనం





670 లైవ్ బీజీఎల్ షెల్స్ సహా భారీగా పేలుడు సామగ్రి పట్టివేత

ఎటపాక, నవంబర్ 18 (మీ వార్త ప్రతినిధి): వామపక్ష తీవ్రవాద కార్యకలాపాల కట్టడికి ఆంధ్రప్రదేశ్ పోలీసులు చేపడుతున్న చర్యల్లో భాగంగా మావోయిస్టులకు చెందిన భారీ పేలుడు పదార్థాల రహస్య నిల్వ కేంద్రాన్ని భద్రతా బలగాలు గుర్తించి స్వాధీనం చేసుకున్నాయి. ఆంధ్రప్రదేశ్--ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో పోలవరం జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి ఆదేశాలతో ప్రత్యేక పోలీసు బృందం, సీఆర్పీఎఫ్ బలగాల సహకారంతో నిర్వహించిన అంతర్రాష్ట్ర గాలింపు చర్యల్లో ఈ డంప్ బయటపడింది. గత ఏడాది నిర్వహించిన ఒక ఆపరేషన్‌లో మాడ్వి హిడ్మాకు చెందిన ఈఓఎఫ్ ను నిర్వీర్యం చేసిన నేపథ్యంలో, పోలీసులు నిరంతర నిఘా, సమాచార సేకరణను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో మావోయిస్టులు రహస్యంగా పేలుడు పదార్థాలను నిల్వ ఉంచినట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో కూనవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అనంతరం ప్రత్యేక బృందాలు సరిహద్దు ప్రాంతంలో గాలింపు చేపట్టి భారీగా పేలుడు సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి. భద్రతా బలగాలు, రాజకీయ నాయకులను లక్ష్యంగా చేసుకుని ప్రాణనష్టం కలిగించే ఉద్దేశంతో మావోయిస్టులు ఈ పేలుడు పదార్థాలను ముందస్తుగా రహస్య ప్రాంతంలో దాచినట్లు ప్రాథమికంగా గుర్తించారు. డంప్‌లో 670 లైవ్ బీజీఎల్ షెల్స్, 42 నాన్ ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, 250 గ్రాముల గన్‌పౌడర్, 25 కార్డెక్స్ ముక్కలు, 12 బూస్టర్/ఎక్స్‌ప్లోజివ్ రింగులు, ఏడు లైవ్ భర్మార్ కార్ట్రిడ్జ్‌లు, 16 ఖాళీ 62 ఎంఎం కేసులు, సుమారు ఆరు మీటర్ల ఫ్యూజ్‌తో పాటు 20 రకాల అత్యవసర మందులు, వైద్య సామగ్రి, కిట్ బాక్సులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఎటపాక పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోలవరం జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి ఐపీఎస్ మాట్లాడుతూ.. పోలవరం జిల్లా పరిధిలోనే కాకుండా సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టులు దాచిన మిగిలిన సామగ్రి నిల్వ కేంద్రాలను సైతం నిరంతర గాలింపు చర్యల ద్వారా గుర్తించి స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ 212వ బెటాలియన్ (కొంటా రేంజ్, ఛత్తీస్‌గఢ్ సెక్టార్) సెకండ్ ఇన్ కమాండ్ దినేష్ కుమార్, సీఆర్పీఎఫ్ కోబ్రా 204, 196వ బెటాలియన్లకు చెందిన దీపక్ కుమార్ గుర్వే, అభిషేక్ మిశ్రా, నీరజ్ కుమార్ సింగ్, సచిన్ కుమార్, రణవీర్ సింగ్ జాట్, హరీష్ కుమార్ సింగ్ పాల్గొన్నారు. అలాగే సీఆర్పీఎఫ్ 141వ బెటాలియన్ సెకండ్ ఇన్ కమాండ్ ప్రీత సి., పోలవరం జిల్లా ఓఎస్ఓ (పరిపాలన, కార్యకలాపాలు) ఎం. జావళి అల్ఫోన్స్ ఐపీఎస్, చింతూరు సబ్ డివిజన్ ఏసీపీఓ కె. ఉదయ పావని, జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ సిఐ యం. కన్నపరాజు, ఎటపాక ఎస్సై జి. అప్పలరాజు తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ నేషనల్ అవార్డు గ్రహీత బోయిని బాబుకు ఘన సన్మానం..

అభినందించిన సిద్దిపేట ఏసీపీ గడ్డం సదన్ కుమార్

చిగురుమామిడి మండలం నవాబుపేటలో నాయకులు,దళిత సంఘాల భారీ ర్యాలీ



చిగురుమామిడి నవంబర్ 18 (మీ వార్త ప్రతినిధి సోన్నాయిల భరత్): న్యూఢిల్లీలో బహుజన సాహిత్య అకాడమీ ద్వారా ఇటీవల ప్రతిష్టాత్మక "అంబేద్కర్ నేషనల్ అవార్డు" అందుకున్న యువ నాయకుడు బోయిని బాబును సిద్దిపేట ఏసీపీ (సీసీఎస్) గడ్డం సదన్ కుమార్ తదితరులు ప్రత్యేకంగా అభినందించి,ఘనంగా సన్మానించారు.ఈ అవార్డు రావడాన్ని పురస్కరించుకుని చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు మరియు దళిత సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.అనంతరం స్థానిక బస్టాండ్ ఆవరణలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ భావజాల వ్యాప్తి కోసం బోయిని బాబు గత దశాబ్ద కాలంగా విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆయన సేవలను గుర్తించి జాతీయ స్థాయిలో అంబేద్కర్ అవార్డు ప్రదానం చేయడం తమ ప్రాంతానికే గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాణా ప్రతాప్ సింగ్, గొట్టి రఘుబాబు, వివిధ పార్టీల నాయకులు ఠాకూర్ నరేందర్ సింగ్, బోయిని ఆది మల్లయ్య, బోయిని సతీష్, బోయిని విజయ్ కుమార్, బోయిని మనోజ్, బోయిని వంశీకృష్ణ, బోయిని సురేష్, శంకర్, ఉమేష్, రఘు, పందిపెల్లి మహేష్, సంపత్, రాజయ్య, లింగయ్య, ఎనగందుల సంజీవ్, ఆంజనేయులు, నితిన్, లడ్డు తదితరులు పాల్గొన్నారు.

"అక్వాన్" తుఫాన్ నేపథ్యంలో ప్రజలకు అప్రమత్తంగా ఉండాలి

వేలేరుపాడు, నవంబర్ 18 (మి వార్తా ప్రతినిధి) అక్వాన్" తుఫాను వల్ల ఈదురు గాలులతో కూడిన అత్యంత భారీ వర్షాలు ఉన్న కారణంగా స్థానిక ప్రభుత్వ అధికారుల సూచనలను మరియు హెచ్చరికలను ఎప్పటికప్పుడు పాటిస్తూ, గోదావరి నది పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని, తాసిల్దార్ సూచించారు.తుఫాను సమయంలో అనవసరమైన ప్రయాణాలను మానుకోవాలనీ, గోదావరి నది ఒడ్డున ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలు ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నపిల్లలు, అంగవైకల్యం గలవారు మరియు వృద్ధుల విషయంలో అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలనీ, వర్షపు నీటితో మునిగిపోయిన రహదారులు, వంతెనలు, కల్వర్టులు, వాగులు మరియు ఇతర జలమార్గాలను ఎట్టి పరిస్థితుల్లోనూ దాటేందుకు ప్రయత్నించవద్దు మరియు జాలరులు చేపల వేటకు నది లోనికి వెళ్ళరాదు. ఎండిపోయిన పెద్ద పెద్ద చెట్లను, పాత భవనాలను ఆశ్రయించకూడదు. తడిసి ఉన్న కరెంటు స్తంభాలను తాకకూడదు. ఎవరైనా రేకు షెడ్డులలో మరియు మట్టిగోడలు గల తాటి ఆకుల వంటి తాత్కాలిక ఇళ్లల్లో నివశిస్తున్న వారు బంధువుల ఇళ్లకు లేదా సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలనీ మరియు ఎవరైనా ఇళ్ల పరిసరాలలో కొబ్బరి చెట్లు/తాటి చెట్లు ఉన్న వారు అప్రమత్తంగా ఉండవలెననీ ప్రభుత్వ పరమైన సూచనలను అనుసరించి ప్రజలు ప్రాణ మరియు ఆస్థి నష్టాలు జరగకుండా సహకరించాలని సవినయంగా . ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడినట్లయితే వెంటనే సంబంధిత మండల తహసీల్దార్ కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలి.

తహశీల్దార్ వేలేరుపాడు మండలం కంట్రోల్ రూమ్ నెంబర్.
9014102968
సదరు విషయములో ప్రజలను అప్రమత్తత చేసే విషయంతో బాటు భారీ వర్షాలకు ప్రభావితమయ్యే



సమయానికి ముందే సంబంధిత మండల శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

వైసీపీ లో 5 కుటుంబాల చేరిక



యర్రగొండపాలెం, నవంబర్ 18 (మీవార్త విలేకరి) మండల పరిధిలోని నరసాయపాలెం గ్రామంలోని ఎస్సీ పాలెం రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. స్థానిక నాయకులు తెలిపిన వివరాల ప్రకారం, గ్రామానికి చెందిన 5 కుటుంబాలు తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు ముటుకూరి ప్రకాష్ ముటుకూరి దేవదానయ్య,, ముటుకూరి చిన్నదానయ్య, మండ్ల చిన్న, యోగయ్య వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.స్వయంగా వారికి పార్టీ కండువా కప్పి వైఎస్సార్ సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ఈ చేరికలు మరింత ఊతమిస్తాయని స్థానిక నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నరసాయపాలెం గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు, మండల స్థాయి నేతలు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

హితచింతక అభియాన్‌లో భాగంగా గుడివాడలో పుస్తకాల పంపిణీ

గుడివాడ, నవంబర్ 18(మీ వార్త ప్రతినిధి) విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హితచింతక అభియాన్‌లో భాగంగా బుధవారం కృష్ణాజిల్లాలోని గుడివాడ పట్టణంలో పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా ప్రబారి గౌరవనీయులు శ్రీ పల్నాటి వెంకటస్వామి నాయుడు గారు, జిల్లా కార్యదర్శి శ్రీ వర్రె రాజశేఖర్ గారు పాల్గొని అభియాన్ కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. హితచింతక అభియాన్ లక్ష్యాలు, సంస్థ ఆశయాలు, ధార్మిక మరియు సామాజిక చైతన్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే దిశగా కార్యకర్తలకు మార్గనిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జె.వి.వి. కుమారి, బి. శ్రీదేవి, కొల్లిపర్రు విజయలక్ష్మి, కె. లక్ష్మీకుమారి తదితర మహిళా కార్యకర్తలు పుస్తకాల పంపిణీలో చురుకుగా పాల్గొన్నారు.హితచింతక అభియాన్ ప్రధాన ఉద్దేశం విశ్వ హిందూ పరిషత్ ఆశయాలు, కార్యక్రమాలు, హిందూ ధర్మ పరిరక్షణ, సామాజిక సమరసత, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు మరియు హిందూ సమాజ ఐక్యతకు సంబంధించిన ఆలోచనలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం.



పుస్తకాలు, సాహిత్యం ద్వారా ధార్మిక అవగాహనతో పాటు సమాజం పట్ల బాధ్యత, సాంస్కృతిక విలువల పట్ల గౌరవాన్ని పెంపొందించడం ఈ అభియాన్‌లో ముఖ్యమైన అంశం.హితచింతక అభియాన్‌లో మహిళా కార్యకర్తల భాగస్వామ్యం ప్రత్యేకంగా అభినందనీయం. కుటుంబాల స్థాయి నుంచి సమాజంలోని వివిధ వర్గాల వరకు చేరువవుతూ ధార్మిక చైతన్యం, సామాజిక సమరసత, సేవాభావాన్ని విస్తరించడంలో మహిళల పాత్ర కీలకమైనది.వ్యక్తి కంటే సంస్థ గొప్పది -- సంస్థ కంటే సమాజ హితం ప్రధానమైనది అనే స్ఫూర్తితో ప్రతి గ్రామం, ప్రతి పట్టణంలో హితచింతక అభియాన్‌ను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలు కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

వార్డు మెంబర్ గా కూటమి అభ్యర్థి దివ్య నామినేషన్



లింగపాలెం, నవంబర్ 17 (మీ వార్త విలేఖరి):మండల పరిధిలోని మఠంగూడెం గ్రామ పంచాయతీ 1వ వార్డు మెంబర్ గా తెలుగుదేశం, బిజెపి బలపరిచిన జనసేన పార్టీ అభ్యర్థిని పంది దివ్య (మహేష్) ధర్మాజిగూడెం సచివాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రం వద్ద రిటర్నింగ్ అధికారికి నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు రాయల ప్రసాద్ , పంది మహేష్ బాబు, సాయిల ప్రేమ్ కుమార్, పొదిల మహేష్, అబ్బుదాసరి మరియదాస్ , పొదిల గిరి, పొదిల వెంకటేష్, అబ్బుదాసరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నామినేషన్ దాఖలు కూటమి సర్పంచ్ అభ్యర్థిని రాయల కనకదుర్గ



లింగపాలెం, నవంబర్ 18 (మీ వార్త విలేఖరి): మండల పరిధిలోని మట్టిగూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ నీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా, తెలుగుదేశం జనసేన బిజెపి పార్టీ లు అభ్యర్థిని రాయల కనకదుర్గ నామినేషన్‌ను దాఖలు చేశారు.పార్టీ శ్రేణులు, మద్దతుదారులు మరియు గ్రామస్థులతో కలిసి ఆమె భారీ ర్యాలీగా వెళ్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, నాయకురాల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో మట్టంగూడెం గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. నామినేషన్ దాఖలు అనంతరం రాయల కనకదుర్గ ప్రసాద్ మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా తాము తెలుగుదేశం పార్టీలో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలుగా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేశానని పేర్కొన్నారు. తన సుదీర్ఘ సేవలను, కష్టాన్ని గుర్తించి మట్టం గూడెం పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిని అవకాశం కల్పించిన కూటమి పార్టీ అధిష్టానానికి మరియు స్థానిక నాయకత్వానికి కనకదుర్గ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.గ్రామ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన మరియు ప్రజల సమస్యల పరిష్కారానికి తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, రానున్న ఎన్నికల్లో ఆమెని ఆశీర్వదించి గెలిపించాలని గ్రామ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

అవిడిలో వైసీపీ సర్పంచ్ అభ్యర్థిగా పల్లి సౌమ్య దిలీప్ నామినేషన్!



ప్రజల సమస్యలే నా ధ్యేయం.. అభివృద్ధే నా లక్ష్యం!

భారీ ర్యాలీతో నామినేషన్ దాఖలు.. అభిమానుల కేరింతల మధ్య సందడి

కొత్తపేట, నవంబర్ 18 (మీ వార్త విలేఖరి): మండల పరిధిలోని అవిడి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా వైసీపీ తరపున పల్లి సౌమ్య దిలీప్ కుమార్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు.ఈ సందర్భంగా గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సౌమ్య దిలీప్ కుమార్ మాట్లాడుతూ, "ప్రజల సమస్యలే నా ధ్యేయం.. అభివృద్ధే నా లక్ష్యం" అని స్పష్టం చేశారు.అవిడి గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.గ్రామంలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, పారిశుధ్యం వంటి మౌలిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. "గ్రామ అభివృద్ధి కోసం.. ప్రజల సంక్షేమం కోసం.. మీతోనే నేను" అంటూ ఓటర్లను కోరారు.పార్టీలకు అతీతంగా, గ్రామంలోని ప్రతి ఒక్కరి సంక్షేమం కోసం పని చేస్తానని, అవిడిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని ఆయన అన్నారు.నామినేషన్ కార్యక్రమంలో వైసీపీ మండల నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



హిత చింతక్ అభియాన్: హిందూ సమాజ సంపర్కం, సంఘటన, ధార్మిక చైతన్యానికి విస్తృత కార్యక్రమం

విశ్వహిందూ పరిషత్ -- కృష్ణా జిల్లా అధ్వర్యంలో

గన్నవరం నవంబర్ 18(మీ వార్త ప్రతినిధి)
గన్నవరం మండలంలోని ఐదు గ్రామాల్లో ప్రముఖులతో సంపర్కం,విశ్వహిందూ పరిషత్ దేశవ్యాప్తంగా చేపడుతున్న హిత చింతక్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈరోజు కృష్ణా జిల్లా గన్నవరం మండలంలోని బీబీ గూడెం, కొత్తగూడెం, వీరపనేని గూడెం, పెద్ద అవుటపల్లి, గన్నవరం గ్రామాల్లో విస్తృత సంపర్క కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ కృష్ణా జిల్లా ప్రభారి శ్రీ పి.వి.ఎస్.ఎన్. నాయుడు గారు, కృష్ణా జిల్లా విశేష సంపర్క ప్రముఖ్ శ్రీ వెలుగంటి శివాజీ పాల్గొని ఆయా గ్రామాలకు చెందిన పలువురు పెద్దలు, ప్రముఖులను కలిసి హిత చింతక్ అభియాన్ ఉద్దేశాలు, లక్ష్యాలు, ప్రాధాన్యతను వివరించారు. హిత చింతక్ అభియాన్ అంటే ఏమిటి?హిత చింతక్ అంటే హిందూ సమాజ హితాన్ని, ధర్మ పరిరక్షణను, భారతీయ సంస్కృతి మరియు సంప్రదాయాల పరిరక్షణను ఆకాంక్షించే హితైషి.విశ్వహిందూ పరిషత్ చేపడుతున్న ఈ అభియాన్ ప్రధాన ఉద్దేశం హిందూ సమాజంలోని వివిధ వర్గాల ప్రజలను, ప్రముఖులను, యువతను, మహిళలను, వృత్తి నిపుణులను, వ్యాపారవేత్తలను, సామాజిక సేవకులను సంస్థ ఆశయాలకు పరిచయం చేసి, వారి భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం.ఇది కేవలం సభ్యత్వ నమోదు కార్యక్రమం మాత్రమే కాదు. హిందూ సమాజంలోని ప్రతి ఒక్కరితో ఆత్మీయ సంబంధాలను పెంపొందించడం, సంస్థ కార్యకలాపాల గురించి



అవగాహన కల్పించడం, ధార్మిక మరియు సామాజిక కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం దీని విస్తృత లక్ష్యం.అభియాన్ ప్రధాన లక్ష్యాలు

1. ధర్మ పరిరక్షణ: హిందూ ధర్మం, ఆధ్యాత్మిక విలువలు, దేవాలయాలు, భారతీయ సంప్రదాయాల పరిరక్షణపై అవగాహన పెంపొందించడం.
2. సామాజిక సమరసత: కుల, వర్గ భేదాలకు అతీతంగా హిందూ సమాజంలోని ప్రతి ఒక్కరినీ పరస్పర గౌరవం, సోదరభావంతో అనుసంధానించడం.
3. సంస్కృతి పరిరక్షణ: భారతీయ కుటుంబ వ్యవస్థ, సంస్కారాలు, పండుగలు, ఆచార వ్యవహారాలు, సాంప్రదాయ విలువలను భావితరాలకు అందించడం.
4. యువత భాగస్వామ్యం: యువతలో దేశభక్తి, ధార్మిక అవగాహన, సేవాభావం, సామాజిక బాధ్యతలను పెంపొందించడం.
5. మహిళల భాగస్వామ్యం: ధార్మిక, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాల్లో మహిళల పాత్రను ప్రోత్సహించడం.
6. సేవా కార్యక్రమాలు: సమాజంలోని అవసరమైన వర్గాలకు విద్య, ఆరోగ్యం, సేవా కార్యక్రమాల ద్వారా సహకారం అందించే సామాజిక బాధ్యతను పెంపొందించడం.
7. సంస్థాగత బలోపేతం: ప్రతి గ్రామంలో ధర్మాభిమానులు, సామాజిక ప్రముఖులు, యువత, సేవాభావం కలిగిన వ్యక్తులతో నిరంతర సంపర్కాన్ని పెంపొందించడం.ప్రతి హిందువు భాగస్వామ్యం అవసరం,హిందూ సమాజ ఐక్యత అనేది కేవలం కొందరు కార్యకర్తల బాధ్యత మాత్రమే కాదు. ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తి, ప్రతి గ్రామం ఇందులోభాగస్వాములు కావాలి. ధర్మం పట్ల అవగాహన, సమాజం పట్ల బాధ్యత, దేశం పట్ల నిబద్ధత కలిగిన పౌరులుగా ఎదగడానికి హిత చింతక్ అభియాన్ ఒక వేదికగా ఉపయోగపడుతుంది.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ప్రముఖులు హిత చింతక్ అభియాన్ ఉద్దేశాలను తెలుసుకొని, ధార్మిక మరియు సామాజిక చైతన్య కార్యక్రమాలకు సహకరించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.వ్యక్తి కంటే సంస్థ గొప్పది -- సంస్థ ద్వారా సమాజ సంఘటన, సమాజం ద్వారా ధర్మ పరిరక్షణ సాధ్యమవుతాయి అనే సంకల్పంతో కృష్ణా జిల్లాలోని ప్రతి మండలం, ప్రతి గ్రామానికి హిత చింతక్ అభియాన్‌ను విస్తరించేందుకు విశ్వహిందూ పరిషత్ కృషి చేస్తోంది.ధర్మో రక్షతి రక్షితః విశ్వహిందూ పరిషత్ -- కృష్ణా జిల్లా

అన్ని వర్గాల భాగస్వామ్యంతోనే పట్టణ సమగ్ర అభివృద్ధి సాధ్యం: నూతన మేయర్ గా ఎన్నికైన రెడ్డి అప్పలనాయుడు

ఏలూరు,నవంబర్18 (మీ వార్త ప్రతినిధి):
అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతోనే ఏలూరు నగర సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని, అందుకు ప్రతి ఒక్కరి సహకారంతో తాను ముందుకు వెళ్తానని ఏలూరు నగర మేయర్‌గా ఇటీవల ఎన్నికైన రెడ్డి అప్పలనాయుడు స్పష్టం చేశారు. మేయర్‌గా ఘన విజయం సాధించిన ఆయనకు నగరంలోని వివిధ వర్గాల నుంచి అభినందనల వెల్లువ కొనసాగుతోంది. బుధవారం ఆయన నివాసం వద్ద మరియు జనసేన పార్టీ కార్యాలయంలో పలువురు ప్రముఖులు, ఆధ్యాత్మిక పెద్దలు, వివిధ సంఘాల ప్రతినిధులు , నగరపాలక సంస్థకు చెందిన వివిధ శాఖల సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సత్కరించారు. చోడిదెబ్బ పెద్దరామాలయం పీఠం స్వాములు, కొత్తూరు కోదండ రామాలయం కమిటీ సభ్యులు ఉన్నారు. వీరితో పాటు నిమ్మకాయల వర్తక సంఘం అధ్యక్షులు ఉప్పలపాటి చక్రపాణి మరియు సభ్యులు, నాగవంశం సంక్షేమ సంఘం నాయకులు, గాంధీ మైదానం కాపు సంఘం నాయకులు అప్పలనాయుడిని కలిసి అభినందనలు తెలిపారు. ఏలూరు నగరపాలక సంస్థకు చెందిన పంప్ ఫిట్టర్లు,



పంప్ ఆపరేటర్లతో పాటు వివిధ విభాగాల సిబ్బంది, స్థానికులు తరలివచ్చి తమ నూతన మేయర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. మరోవైపు, ఈ నెల 23వ తేదీన జరగనున్న మేయర్ ప్రమాణ స్వీకార మహోత్సవం పట్ల జనసేన సహా కూటమి శ్రేణులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాయి. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి సహకారంతో, ఇతర ప్రజాప్రతినిధులు , కార్పొరేషన్ సిబ్బంది, నగర వాసులందరి సమష్టి కృషితో ఏలూరును ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు.

మహా కూటమి బలపరిచిన కొకనారాయణ పాలెం గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పుప్పాల సురేష్.....

గూడూరు నవంబర్ 18(మీ వార్త ప్రతినిధి)
గూడూరు మండలంలోని కొకనారాయణ పాలెం గ్రామ సర్పంచ్ స్థానానికి ఎంపీ వల్లభనేని బాల సౌరీ, శాసన సభ్యులు కాగిత కృష్ణా ప్రసాద్ లు బలపరిచిన మహా కూటమి పార్టీ అభ్యర్థిగా పుప్పాల సురేష్ ఖరారు అయ్యారు. ఈ సందర్భంగా సురేష్ మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం పాలనలో పంచాయతీ రాజ్ వ్యవస్థలో బ్లీచింగ్, దోమల మందు కొట్టె పరిస్థితి లేక అప్పటి అధికార పార్టీ తరపున సర్పంచ్ లుగా గెలిచిన వారు తిరుమల విధుల్లో అర్ధ నగ్నంగా పంచాయతీలో కేంద్రం యిచ్చిన నిధులు సైతం కాజేస్తున్న అప్పటి ప్రభుత్వం పై నిరసన వ్యక్తం చేసారని. అప్పట్లో పంచాయతీ రాజ్ వ్యవస్థ 18 వ స్థానానికి పడిపోయి పూర్తిగా దారి తప్పిన పరిస్థితిలో మహా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రెండున్నర ఏళ్లలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సామర్థ్యం వల్ల 18 వ స్థానంలో నుండి పంచాయతీ రాజ్ శాఖ దేశంలోనే నెంబర్ 1 స్థానంకు చేరుకుంది అని అందువల్లనే నేడు పంచాయతీ ఎన్నికల్లో పోటీలో ఉన్న



కూటమి అభ్యర్థులకు ప్రజల్లో మంచి ఆదరణ వస్తుంది అని అన్నారు. కొకనారాయణ పాలెం గ్రామ ప్రజలకు 24 / 7 అందుబాటులో ఉంటూ ఎంపీ వల్లభనేని బాల సౌరీ, శాసన సభ్యులు కాగిత కృష్ణా ప్రసాద్ తనపై పెట్టుకున్న నమ్మకం నిలబెట్టుకుంటానని పుప్పాల సురేష్ అన్నారు. కొకనారాయణ పాలెం కూటమి సర్పంచ్ అభ్యర్థిగా ఖరారు అయిన పుప్పాల సురేష్ ను జనసేన నాయకులు లింగం నాగేశ్వరావు, అంకేం లక్ష్మి శ్రీనివాస్, మహా కూటమి నాయకులు అభినందించారు.....

కోదాడ అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమం

అయ్యప్ప స్వామి నామస్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణం.

కోదాడ: పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో కార్తీక మాసం, అయ్యప్ప మాలధారణ సందర్భంగా భక్తిభావంతో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయానికి పెద్ద సంఖ్యలో అయ్యప్ప స్వాములు, భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని కోరిన కోరికలు తీర్చమని వేడుకుంటారు. ప్రతిరోజు స్వామివారికి ప్రత్యేక అభిషేకములు, అలంకరణ నిర్వహిస్తారు. కోదాడ అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రతి బుధవారం స్వామివారికి పల్లకి సేవ నిర్వహించడం జరుగుతుంది, అయ్యప్ప నామస్మరణలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం భక్తిమయ వాతావరణాన్ని సంతరించుకుంది. అయ్యప్ప స్వాములు, మాలధారులు, మహిళలు, చిన్నారులు, వృద్ధులు సహా ఆలయానికి విచ్చేసిన భక్తులం దరికీ ప్రేమాభిమానాలతో అన్నప్రసాదాన్ని అందజేశారు. భక్తులు క్రమశిక్షణతో అన్నప్రసాదాన్ని స్వీకరించి నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్తీక మాసంలో అయ్యప్ప మాలధారణకు ఎంతో విశిష్టత ఉందని, ఈ పవిత్ర సమయంలో భక్తితో స్వామివారిని ఆరాధించడంతో పాటు సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ఎంతో పుణ్యప్రదమని భక్తులు పేర్కొన్నారు. అన్నదానం అన్ని దానాల్లోకెల్లా గొప్పదని, కార్తీక మాసంలో చేసే ప్రతి దానం రెట్టింపు ఫలితం అందిస్తుందని అంటారు.ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం ద్వారా మానవత్వం, సేవాభావం చాటుకోవచ్చని అన్నారు. ఆధ్యాత్మికతతో పాటు సేవా భావాన్ని పెంపొందించే ఇలాంటి అన్నదాన కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సోదరభావం, భక్తిభావాన్ని మరింత పెంపొందిస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థించారు. ఈరోజు స్వామివారికి నైవేద్యం సమర్పించిన వారు వేజెండ్ల శివనాగు భవాని దంపతులు. ఈరోజు అన్నదాతలు నారాయణపురం వాస్తవ్యులు బూర వెంకటనారాయణ, లక్ష్మీనారాయణ, నరసింహారావు కుటుంబ సభ్యులు.
ఈ అన్నదాన కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప స్వాములు, మాలధారులు, భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

రాష్ట్ర మాక్ అసెంబ్లీకి ఎన్నికైన విద్యార్థిని కాంద్రేగుల లిఖితను సన్మానించిన -ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



పి గన్నవరం నవంబర్ 17(మీ వార్త విలేఖరి రవి) గన్నవరం మండలంలోని ఎమ్మెల్యే వారి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర మాక్ అసెంబ్లీకి ఎన్నికైన విద్యార్థిని కాంద్రేగుల లిఖితను పి. గన్నవరం ఎమ్మెల్యే శ్రీ గిడ్డి సత్యనారాయణ ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఇలాంటి ప్రతిష్టాత్మక వేదికకు ఎంపిక కావడం అభినందనీయమని, ఇది ఆమె ప్రతిభ, నాయకత్వ లక్షణాలకు నిదర్శనమని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక అవగాహన, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని సూచించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నేడే పెంటపాడు ఎంపిపి, వైస్ ఎంపిపి ఎన్నిక



పెంటపాడు, నవంబర్ 18 (మీ వార్త ప్రతినిధి) పెంటపాడు మండలం ప్రజా పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎంపిక నవంబర్ 19వ తేదీ ఉదయం 10:30 గంటలకు పెంటపాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరుగునని ఎంపీడీవో ముప్పిడి వెంకటేశు అన్నారు. తొలుత కో-ఆప్షన్ సభ్యుని ఎన్నిక జరుగుతుందని, అనంతరం మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక జరుగుతుందని ఎంపీడీవో ముప్పిడి వెంకటేశు తెలిపారు.

బాలుర ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి ఆకస్మిక పరిశీలన

రాజోలు నవంబర్ 18 (మీ వార్త విలేఖరి) డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా రాజోలు బాలుర ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్కే మెహబూబ్ బాషా బుధవారం ఆకస్మిక పరిశీలన చేశారు. ఈ మేరకు బుధవారం సాయింత్రం రాజోలు బాలుర ఉన్నత పాఠశాలలో పదోవ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న అదనపు క్లాస్ ను పరిశీలించిన డీఈవో భాషా విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. పదోవ తరగతి విద్యార్థులను ప్రశ్నించిన డీఈవో విద్యార్థుల నుండి ఉపాధ్యాయుల బోధన తీరును తెలుసుకున్నారు. అనంతరం డీఈవో బాషా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ పరిశీలనలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె సరస్వతీ, ఉపాధ్యాయులు బి నాగేశ్వరరావు, సిహెచ్ లీలావతి, సిహెచ్ జీవి ప్రసాద్, ఎంఎల్జీ రావు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం ఆర్టీసీ డిపో ఏసీ బస్సు ప్రయాణికులకు 10% నుంచి 20% వరకు టికెట్ ధరల్లో రాయితీ



అమలాపురం,మీ వార్త ప్రతినిధి,నవంబర్,18 అమలాపురం డిపో నుంచి హైదరాబాద్ మరియు తిరుపతికి నడుపుతున్న ఏసీ బస్సు సర్వీసులైన అమరావతి, నైట్ రైడర్ బస్సుల్లో ప్రయాణించే వారికి అప్ అండ్ డౌన్ ప్రయాణ టికెట్ ధరలపై 20 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు అమలాపురం డిపో మేనేజర్ ల్.ప్రేమ్ కుమార్ తెలిపారు. అదేవిధంగా అమలాపురం నుంచి విశాఖపట్నం మరియు విజయవాడకు నడుపుతున్న ఇంద్ర ఏసీ బస్సు సర్వీసులలో అప్ అండ్ డౌన్ ప్రయాణ టికెట్ ధరలపై 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఈ రాయితీ సదుపాయం ఈ నెల 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మాత్రమే అమలులో ఉంటుందని తెలిపారు. ప్రయాణికుల నుంచి లభించే ఆదరణను బట్టి ఈ రాయితీని డిసెంబర్ నెలలో కూడా పొడిగించే విషయంపై నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. కావున ప్రయాణికులు ఈ ప్రత్యేక రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్టీసీ ఏసీ బస్సు సేవలను వినియోగించుకోవాలని అమలాపురం డిపో మేనేజర్ ల్.ప్రేమ్ కుమార్ కోరారు.

ఏఐటీయుసి జాతీయ మహాసభలను జయప్రదం చేయండి....

ఏలూరు, నవంబర్ 18
ఏలూరు:బెంగళూరులో ఈనెల 22 నుంచి 26 వరకు జరుగనున్న ఏఐటీయూసీ 43వ జాతీయ మహాసభలను కార్మికులు,ఉద్యోగులు జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ డాంగే,ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు.ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కార్యాలయం స్మార్తి భవనం నందు విలేకరుల సమావేశం జరిగింది.ఈ సమావేశంలో శ్రీనివాస్ డాంగే మాట్లాడుతూ కార్మిక హక్కుల రక్షణకు,ప్రజాస్వామ్య పరిరక్షణకు, దేశంలో కార్పొరేట్ విధానాలు తిప్పికొడుతూ ఏఐటీయూసీ అనేక పోరాటాలు చేస్తుందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలంబిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలపై కార్మిక వర్గం చేస్తున్న పోరాటాలు, భవిష్యత్తు కార్యాచరణ ఈ జాతీయ మహాసభలలో రూపొందిస్తుందని తెలిపారు. ఏ ఐ టి యు సి జాతీయ మహాసభలు ప్రారంభం రోజున నవంబర్ 22న వేలాది మందితో బెంగళూరులో ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతుందని ఆయన



తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లను ప్రవేశపెట్టి పాలన సాగిస్తున్న నేపథ్యంలో దేశంలోని కార్మిక వర్గాన్ని ఒక వేదికపై తీసుకువచ్చి పోరాటాలు చేయడానికి ఈ మహాసభలు వేదిక కాబోతున్నాయని తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని మహాసభలో ప్రధానంగా చర్చించి కార్యాచరణను రూపొందించడం జరుగుతుందని తెలిపారు. కార్మికులకు సామాజిక, ఉద్యోగ భద్రత ఉండాలని, అన్ని రంగాలలో ఉన్న ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలని, దేశ సంపదను కాపాడాలని, కార్పొరేట్ల దోపిడీ నుంచి దేశాన్ని రక్షించుకోవడం కోసం ఏఐటీయుసి మహాసభలలో విస్తృతంగా చర్చిస్తుందన్నారు.కార్మికుల సమస్యలు, చట్టాలు, హక్కులపై చర్చించి తీర్మానాలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, సహాయ కార్యదర్శి ఏ అప్పలరాజు పాల్గొన్నారు.

విజయవాడ మేయర్ వంగవీటి రాధాకృష్ణ ని కార్పొరేటర్ల ను ఘనంగా సన్మానించిన బుల్లెట్ ధర్మారావు





విజయవాడ నవంబర్ 18(మీ వార్త ప్రతినిధి)
కీర్తిశేషులు శ్రీ వంగవీటి మోహన రంగా గారి కుమారుడు విజయవాడ జనసేన పార్టీ మేయర్ గా భారీ మెజార్టీతో గెలుపొందిన శ్రీ వంగవీటి రాధాకృష్ణ బాబు కార్యాలయం నందు రాధా రంగా మిత్రమండలి ఆంధ్ర-తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షులు ఉ జనసేన పార్టీ నాయకులు బుల్లెట్ ధర్మారావు మరియు మహిళా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రాధా బాబు గారిని దృశ్యాలువా తో ఘనంగా సత్కరించి పూల బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపినారు. ఈ సందర్భంగా తిరుపతికి చెందిన రాధా రంగా మిత్రమండలి నాయకులు పొర్లుదండాల ఈశ్వర్ వారి మిత్ర బృందం కలిసి రాధా బాబు కి తిరుపతి వెంకటేశ్వర స్వామి వారి లడ్డు ప్రసాదం, క్యాలెండర్ బహూకరించినారు. రాధా రంగా మిత్రమండలి నెల్లూరు జిల్లా గౌరవాధ్యక్షులు పప్పు లక్ష్మీనారాయణ గారు, చెన్ను శివ ప్రసాద్ వారి మిత్ర బృందం కలిసి రాధా బాబు కి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపినారు. పాత మాజేరు గ్రామానికి చెందిన రాధా రంగా మిత్రమండలి అధ్యక్షులు అంబుల రంగసాయి వారి మిత్ర బృందం రాధా బాబు కి శుభాకాంక్షలు తెలిపినారు. అనంతరం 5 డివిజన్ల లో బుల్లెట్ ధర్మారావు ,ఆకారపు విజయ కుమారి ,మల్లాడి రాజేష్, వెన్న శ్రీనివాస్, కొప్పినేటి శివమణి, లంకా శ్రీధర్..తదితరులు వారిని గెలిపించిన సందర్భంగా..28వ డివిజన్ కొవ్వూరి కిరణ్ బాబు , 29వ డివిజన్ శ్రీమతి పోతిరెడ్డి అనిత , 36 వ డివిజన్ ఏలూరి శరత్ ,43 వ డివిజన్ శ్రీమతి గుర్రం కనకదుర్గ , 45వ డివిజన్ శ్రీమతి అత్తలూరి కళ్యాణి ను. ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపినారు..

తేనెటీగల పెంపకం పై మూడో రోజు ప్రత్యేక శిక్షణ

తాడేపల్లిగూడెం నవంబర్ 18 (మీ వార్త ప్రతినిధి)
డా. వై.ఎస్.ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కృషి విజ్ఞాన కేంద్రం (కె.వి.కె.), వెంకటరామన్నగూడెంలో నిర్వహిస్తున్న ఏడు రోజుల శాస్త్రీయ తేనెటీగల పెంపకం శిక్షణ కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉద్యాన పరిశోధనా స్థానం, వెంకటరామన్నగూడెంకు చెందిన డా. ఎస్. ఆదర్శ, శాస్త్రవేత్త (కీటకశాస్త్రం) డా ఎస్ ఆదర్శ వక్తగా హాజరై తేనెటీగలలో వచ్చే వివిధ పురుగులు, వ్యాధులు, వాటి నివారణ చర్యలు మరియు తేనెటీగల కాలనీల సమర్థవంతమైన నిర్వహణపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు. అదేవిధంగా తేనె సేకరణ, శుద్ధి మరియు ప్రాసెసింగ్ పద్ధతులతో పాటు రాయల్ జెల్లీ తయారీ వంటి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై రైతులకు ప్రయోగాత్మక శిక్షణ అందించారు. తరగతి ముగింపు సమయంలో డా. సి.హెచ్. రూత్, విస్తరణ సంచాలకులు, డా. వై.ఎస్.ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం హాజరై శిక్షణార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. శిక్షణ తరగతులు ఏ మేరకు అర్థమవుతున్నాయి, నేర్చుకున్న సాంకేతిక అంశాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. శిక్షణలో నేర్చుకున్న శాస్త్రీయ పద్ధతులను క్షేత్రస్థాయిలో ఆచరణలో పెట్టి, తేనెటీగల పెంపకాన్ని ఒక లాభదాయకమైన ఉపాధి మరియు స్వయం ఉపాధి మార్గంగా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.



టీడీపీ జడ్పీటీసీ, ఎంపిటిసి సభ్యులను సత్కరించిన వలవల బాబ్జి

తాడేపల్లిగూడెం, నవంబర్ 18 (మీ వార్త ప్రతినిధి)
తాడేపల్లిగూడెం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఇటీవల ఎన్నికైన తెలుగుదేశం పార్టీ జడ్పీటీసీ మరియు ఎంపిటిసి సభ్యులకు తాడేపల్లిగూడెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి, భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి) ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన జడ్పీటీసీ, ఎంపిటిసి సభ్యులను ఆయన శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు . వలవల బాబ్జి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తల కృషి వల్లే ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని, గ్రామాల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సన్మానం అందుకున్న సభ్యులకు ఆయన సూచించారు. ప్రతి గ్రామంలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని కోరారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో స్థానిక ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమని, పార్టీ బలోపేతానికి అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం జడ్పీటీసీ నేకూరి కిరణ్ కుమార్, ఎంపిటిసి సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నేడు శ్రీ గణపతి సుబ్రహ్మణ్య అయ్యప్ప ఆలయ ప్రతిష్ట మహోత్సవ వేడుక...





పెంటపాడు నవంబర్ 18 (మీ వార్త ప్రతినిధి) మండలం లోని రావిపాడు లో శ్రీ గణపతి సుబ్రహ్మణ్య అయ్యప్ప స్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవం గురువారం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్నారు. ఉదయం ఏడు గంటలకు విఘ్నేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంతో మొదలై పుణ్యాహవాచనం, అగ్ని ఆరాధనం వాస్తు పూజ, వాస్తు హోమం పరియజ్ఞ కరణ నవకలశారాధన, చతుర్దశ కలశారాధన, నవమూర్తి ఆరాధన పంచామృతాకలశారాధన, స్వామి వారికి మహా అభిషేకం పంచగవ్యారాధన, క్షీరాధివాస ఆరాధన, జలాధివాస ఆరాధన అర్యన పంచనవ్యాధివాసం, క్షీరాధివాసం, జలాధి వాసం. ఆదివాస త్రయప్రధాన హోమం పాయసాన్న హోమం, నీరాజనం ప్రసాద వితరణ నూతన అయ్యప్ప గణపతి సుబ్రహ్మణ్య శిఖర గ్రామోత్సవం నిర్వహించనున్నారు. గిలు, మహా పూర్ణాహుతి కళాన్యసం కుంభ దర్శనం దేను దర్శనం స్వామి దివ్య దర్శనం యాజమాన్య దంపతులకు భక్తులకు మహదాశీర్వచనం కుంభ మార్జన దీక్ష విసర్జన నీరాజనం ప్రసాద వినియోగం పండిత సత్కారం మరియు అఖండ అన్న సమారాధన జరుగును. కావున యావన్మంది భక్తులు ఈ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలను గురు స్వాములు మానురి రాధాకృష్ణ వింజమూరి శ్రీనివాస్, మెటమర్రి శ్రీనివాస్, కైగాల గణపతి, సభ్యులు గోపిరెడ్డి కాశీ పడాల మణికంఠ మైలవరపు వితేష్ (మెసి) జేనే తాతాజీ మరియు ఇతర కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు.

విజనరీ 2026 నేషనల్ అవార్డు గ్రహీతకు హృదయపూర్వక అభినందనలు

నాదెళ్ల కోటేశ్వరరావు
చైర్మన్ హిందూ బంధువుల ఐక్య వేదిక



పెడన నవంబర్ 18(మీ వార్త ప్రతినిధి) ఆధ్యాత్మిక మరియు సేవా రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచి, జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మకమైన విజనరీ 2026 నేషనల్ అవార్డు అందుకున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక సేవకులు, శ్రీశ్రీశ్రీ అన్నావర్జుల నరసింహారావు పంతులుగారి శిష్యులు శ్రీ నార్ని అమర చందు వశిష్ట గురువుగారికి హృదయపూర్వక శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేస్తున్నాము. హైదరాబాద్‌లోని బిర్లా టెంపుల్ ఆడిటోరియంలో పాన్ ఇండియా కల్చర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో గురువుగారు ఈ జాతీయ పురస్కారాన్ని అందుకోవడం ఎంతో ఆనందదాయకం.ఈ కార్యక్రమానికి మాజీ కేంద్ర మంత్రి శ్రీ వేణుగోపాలాచారి , ప్రముఖ సినీ నటులు శ్రీ సుమన్ , తెలంగాణ మాజీ మంత్రి శ్రీ మధుసూదనాచారి తదితర ప్రముఖులు హాజరయ్యారు.ఆధ్యాత్మిక చింతన, ధార్మిక సేవ, సమాజ హితం పట్ల అంకితభావంతో గురువుగారు చేస్తున్న కృషికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం మనందరికీ గర్వకారణం.ఈ అవార్డు వారి సేవా ప్రయాణానికి మరింత స్ఫూర్తినిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు దోహదపడాలని ఆకాంక్షిస్తున్నాము.వారి ఆధ్యాత్మిక సేవలు మరింత విస్తరించి, సమాజానికి, ధర్మానికి మరిన్ని సేవలు అందించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాము.నాదెళ్ల కోటేశ్వరరావు చైర్మన్ హిందూ బంధువుల ఐక్య వేదిక

ప్రజల ఆశీర్వాదమే మా బలం - ప్రజాసేవ మా లక్ష్యం



తాడేపల్లిగూడెం: నవంబర్ 18 (మీ వార్త ప్రతినిధి) ప్రజల ఆశీర్వాదమే తమ బలమని, ప్రజాసేవే తమ లక్ష్యం అని తాడేపల్లిగూడెం మున్సిపల్ చైర్మన్ కూటమి అభ్యర్థి పాలూరి వెంకటేశ్వరరావు అన్నారు. తాడేపల్లిగూడెం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం 21వ వార్డులో కూటమి బలపరిచిన జనసేన పార్టీ అభ్యర్థి వర్తనపల్లి కాశీతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కూటమి నాయకులు, స్థానిక ప్రజలను కలిసి వారి అభిప్రాయాలు, సమస్యలు తెలుసుకుంటూ కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. చైర్మన్ అభ్యర్థి పాలూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల ఆదరణ, కార్యకర్తల ఉత్సాహం, నాయకుల సహకారం చూస్తుంటే కూటమి విజయంపై విశ్వాసం మరింత బలపడుతోందని పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుదామని, ప్రజల ఆశయాలను నెరవేర్చేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ప్రజల ఆశీర్వాదమే తమ బలమని, ప్రజాసేవే తమ లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



అయ్యప్ప భక్తి నేపథ్యంలో వైభవ్ 'హరిహర పుత్ర'.. ఆకట్టుకుంటున్న టీజర్!

టాలెంటెడ్ హీరో వైభవ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'హరిహర పుత్ర' బ్లాక్‌బస్టర్ సినిమా 'మాళిగాపురం' ఫేమ్ విష్ణు శశి శంకర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. స్వామి అయ్యప్ప భక్తి, ఆధ్యాత్మికత మరియు ఉత్కంఠభరితమైన రహస్యాల నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమా తెలుగు టీజర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఈ చిత్రంలో వైభవ్ పూర్తి భక్తిభావంతో కూడిన అయ్యప్ప భక్తుడిగా నటిస్తుండగా, ఆయన సరసన మీనాక్షి గోవిందరాజన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. వీరితో పాటు ఆడుకాలం నరేన్, అరవింద్ ఆకాష్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రంలో రవి మోహన్, మిర్చి శివ, వెంకట్ ప్రభు, కృష్ణ, మహత్, ప్రేమ్‌జీ అమరన్ మరియు గంగై అమరన్ వంటి ప్రముఖులు ప్రత్యేక పాత్రల్లో నటిస్తున్నారు. తంత్రా ఫిలింస్ పతాకంపై జె.కె. శరవణ, ఎం. రాజారామ్ ఈ చిత్రాన్ని నిర్మించగా, ప్రముఖ దర్శకుడు వెంకట్ ప్రభు దీనికి క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాకు ప్రేమ్‌జీ అమరన్ సంగీతం అందిస్తుండగా, ప్రవీణ్ కె.ఎల్. ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.



బ్లాక్ డ్రెస్‌లో మౌనీ రాయ్ గ్లామర్ షో.. చూపు తిప్పుకోలేరు!

వయ్యారాలు ఒలకబోస్తున్న రకుల్.. క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో కట్టిపడేస్తున్న బ్యూటీ



విమర్శలను మోటివేషన్‌గా మార్చుకుంటున్నా దుల్కర్ సల్మాన్!



ప్రముఖ నటుడు దుల్కర్ సల్మాన్ ఆన్‌లైన్ నెగెటివిటీ, విమర్శలను ఎదుర్కొనే విధానంపై మరియు అవి తన కెరీర్ ఎంపికలపై ఎలాంటి ప్రభావం చూపుతున్నాయనే దానిపై తాజాగా స్పందించారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో తనను తీవ్రంగా కుంగదీసిన విమర్శలు ఇప్పుడు తనకు సులభంగా ఎదుర్కొనేలా మారాయని తెలిపారు. తన ఉద్దేశం ఎప్పుడూ మంచి సినిమాలు చేయడమేనని, ఎంత కష్టపడినా కొద్దిపాటి నెగెటివిటీ రావడం సహజమని ఆయన గ్రహించారు. అయితే, ఆ నెగెటివిటీని తానెప్పుడూ కక్షగా లేదా అసూయగా మార్చుకోలేదని, దాన్ని ఒక మోటివేషన్‌గా తీసుకుని తనని తాను నిరూపించుకోవడానికి ప్రయత్నిస్తానని దుల్కర్ వెల్లడించారు. "కొంతమంది నేను ఒక పాత్ర చేయలేనని భావిస్తే, నేను దాన్ని సవాల్‌గా తీసుకుని చేయడానికి ప్రయత్నిస్తాను. భయపెట్టే లేదా సవాల్‌తో కూడిన పాత్రలను ఎంచుకోవడం వల్ల నటుడిగా నా ఎదుగుదల సాధ్యమైంది. ప్రస్తుతం నాలో ఎలాంటి కసి లేదా పగ లేదు" అని ఆయన భావోద్వేగంగా చెప్పుకొచ్చారు. మరోవైపు, పవన్ సాధినేని దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్ నటిస్తున్న తెలుగు డ్రామా చిత్రం 'ఆకాశంలో ఒక తార' నవంబర్ 20, 2026న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదే రోజున ఆయన తండ్రి, మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి నటించిన 'ఓ.ఎం: ఆపరేషన్ మోల్' కూడా విడుదలవుతుండటంతో, బాక్సాఫీస్ వద్ద తండ్రీకొడుకుల సినిమాల మధ్య ఆసక్తికరమైన పోటీ నెలకొంది.

తిరువీర్ కెరీర్‌లో ఆల్ టైమ్ బ్లాక్‌బస్టర్.. 'మసూద' సినిమాకు 4 ఏళ్లు!



టాలీవుడ్ వర్ధమాన నటుడు తిరువీర్ కెరీర్‌లో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సంచలనాత్మక హారర్ థ్రిల్లర్ 'మసూద' సాయికిరణ్ దర్శకత్వంలో రాహుల్ యాదవ్ నక్కా స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మించిన ఈ చిత్రం, ఎలాంటి భారీ అంచనాలు లేకుండా చిన్న సినిమాగా 2022 నవంబర్ 18న విడుదలై బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించింది. అప్పట్లో ప్రేక్షకులను భయపెడుతూనే బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించిన ఈ సినిమా, తాజాగా విడుదలై నాలుగేళ్లు పూర్తి చేసుకుంది. ఈ చిత్రంలో కేవలం భయపెట్టే హారర్ సన్నివేశాలు మాత్రమే కాకుండా, ప్రేక్షకులను కట్టిపడేసే బలమైన భావోద్వేగాలు ఉండటంతో అన్ని వర్గాల ప్రేక్షకులు దీనికి కనెక్ట్ అయ్యారు. ఒక సాధారణ అమ్మాయి మసూద ఆత్మ ఆవహించడం, ఆమెను కాపాడుకునేందుకు తల్లి నీలం (సంగీత), పక్కనే ఉండే గోపి (తిరువీర్) చేసే ప్రయత్నాలు సినిమాను ఆద్యంతం ఉత్కంఠగా నడిపించాయి. తిరువీర్ సహజ నటనతో పాటు, కీలక పాత్రలో నటించిన నటి సంగీత అద్భుతమైన పెర్ఫార్మెన్స్ సినిమా విజయానికి ప్రధాన బలంగా నిలిచాయి. అలాగే కావ్యా కల్యాణ్‌రామ్, శుభలేఖ సుధాకర్ తదితరుల నటన కూడా చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తక్కువ బడ్జెట్‌తో తెరకెక్కినప్పటికీ, పకడ్బంది స్క్రీన్ ప్లే మరియు నేపథ్య సంగీతంతో ప్రేక్షకులకు సరికొత్త హారర్ అనుభూతిని పంచింది 'మసూద'. ఈ సినిమా ఘన విజయం తిరువీర్ కెరీర్‌ను మలుపు తిప్పడమే కాకుండా, టాలీవుడ్‌లో కొత్త తరహా హారర్-థ్రిల్లర్ జోనర్‌కు సరికొత్త ఊపునిచ్చింది. విడుదలై ఇన్ని ఏళ్లు గడుస్తున్నప్పటికీ, ఈ సినిమా అందించిన భయంతో కూడిన థ్రిల్ మాత్రం ప్రేక్షకుల మదిలో అలాగే నిలిచిపోయింది. మరోవైపు ఈ సినిమా సీక్వెల్ ఎప్పుడా అని ప్రేక్షకుల ఎదురుచూస్తున్నారు.